



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 07 | సంచిక : 359 | అమలాపురం | ఎడిటర్ :కె. సునీల్‌కుమార్ | శుక్రవారం | 30 | ఆగస్టు | 2024 | పేజీలు : 12 | వెల : 2/-


## దేశ భాషలందు తెలుగులెస్స





- మాతృభాషలో ప్రాధమిక విద్యా బోధన, అధ్యయనంతో విద్యార్థులకు విజ్ఞానం
- జీతం కోసం ఆంగ్లం.... జీవితం కోసం తెలుగు నేర్పిస్తాం
- నేను తెలుగు వాడిని...నాది ఆంధ్రప్రదేశ్ అని గర్వంగా చెప్పుకునే చేస్తాం
- 2047 నాటికి దేశంలో ఏపీ ప్రథమస్థానంలో ఉంచడానికి కృషి చేస్తున్నాం
- భాషను మరిచిపోతే.. జాతి కనుమరుగు అవుతుంది
- శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారి 161వ జయంతిని పురస్కరించుకొని జరిగిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు

*మాతృభాషలో అధ్యయనం చేస్తేనే విజ్ఞానం వస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. మాతృభాష తెలుగును కాపాడుకోవాలని చేసే ప్రయత్నంలో పునరంకింతం కావడానికి ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి స్వాగతం పలికిన అనంతరం తెలుగు భాష ఔన్నత్యం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నేడు మహనీయుడైన గిడుగు రామ్మూర్తి 161వ జయంతి జరుపుకుంటున్నాం. తెలుగుభాషను గౌరవించుకోవడం కోసం, కాపాడుకోవడం కోసం ఒక స్ఫూర్తిని తీసుకోవాలన్న ఉద్దేశంతో తెలుగు వెలుగైనటువంటి గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాష దినోత్సవంగా జరుపుకుంటున్నాం.*

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** భాష లేకపోతే మన మనుగడే ఉండదు. తెలుగు జాతికి ఉనికికి, నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలకు మూలం భాష. మనమంతా తెలుగు మాట్లాడుతున్నందుకు గర్వంగా ఉన్నాం. అలాంటి తెలుగు భాష కోసం జీవితాంతం పోరాడి నిలబెట్టిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి. ఆయనకు ఘనమైన నివాళులర్పించి తద్వారా జాతిలో స్ఫూర్తిని నింపే బాధ్యత తీసుకుందాం. త్యాగాలు చేస్తేనే జాతి గుర్తుపెట్టుకుంటుంది. అప్పుడే మనం చేసే పనికి కూడా ఫలితం వస్తుంది. అలాంటి మహనీయుడు గిడుగు రామ్మూర్తి. మన తెలుగు భాషకు ఘనమైన చరిత్ర ఉంది. దేశంలో అత్యధికులు మాట్లాడే భాషలో నాలుగో భాష తెలుగుభాష. 10 కోట్ల మంది మాట్లాడే భాష తెలుగు కావడం గర్వకారణం. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత

మిగతా 2లో..

### రాహుల్ ఎంతో మారిపోయాడు

**ప్రతీదీ ఓ సంకేతమే స్మృతీ ఇరానీ పొగడ్తలు..!**



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** ఒకప్పుడు కాంగ్రెస్ యువరాజుగా ప్రత్యర్థులు విమర్శలు చేసిన రాహుల్ గాంధీ ఇప్పుడు లోక్ సభలో ప్రతిపక్ష నేత హోదాలో దుమ్మురేపుతున్నారు. గతంలో పార్లమెంట్ కు రాడని విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ ఇప్పుడు రెగ్యులర్ గా హాజరవుతూ అధికార పక్షంపై దీటుగా విమర్శలు చేస్తున్నారు. ఇదంతా ఆయనలో వచ్చిన మార్పుకు సంకేతంగా దేశంలో మెజార్టీ ప్రజలు భావిస్తున్నారు. అయితే ఇందులో ఇప్పుడు ఆయన రాజకీయ ప్రత్యర్థి, గతంలో ఆయన్ను ఓడించిన స్మృతీ ఇరానీ కూడా చేరిపోయారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాజీ కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ రాహుల్ గాంధీపై ప్రశంసల జల్లు కురిపించారు. రాహుల్ లో వచ్చిన మార్పుపై అడిగిన ప్రశ్నకు ఆమె చెప్పిన సమాధానాలు ఇప్పుడు సొంత పార్టీ బీజేపీ నేతలకు సైతం షాకిచ్చాయి. ఒకప్పుడు అమేథీలో రాహుల్ గాంధీని ఓడించిన స్మృతీ ఇరానీ తాజా ఎన్నికల్లో ఆయన ఆఫీసులో పనిచేస్తున్న

మిగతా 2లో..

### ఈ వీసా దరఖాస్తుల్లో రికార్డులు బ్రేక్!




**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** భారత్ లో హెచ్ 1 వీసా దరఖాస్తులు రికార్డు స్థాయిలో పెరిగాయి. కరోనా తర్వాత హెచ్ 1 వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య కొంత తగ్గింది. మళ్లీ ఇప్పుడు కరోనా ముందు నాటికి ఉన్న వీసా దరఖాస్తుల పరిస్థితికి చేరుకుంది. అంతేకాకుండా కరోనా ముందు నాటికి ఉన్న వీసా దరఖాస్తుల రికార్డు ఇప్పుడు బ్రేక్ అయ్యింది. ఈ విషయాన్ని వీఎఫ్ఎస్ గ్లోబల్ వెల్లడించింది. అమెరికాలో వర్క్ పర్మిట్ లేదా ఎడ్యుకేషన్ వర్క్ నిమిత్తం వెళ్లేవారికి హెచ్ 1 వీసా జారీ చేస్తారనే విషయం తెలిసిందే. హెచ్ 1 వీసా ఉంటే గ్రీన్ కార్డు (అమెరికాలో శాశ్వత నివాసానికి మార్గం) త్వరగా లభిస్తుందని భావిస్తారు. ఈ నేపథ్యంలో హెచ్ 1 వీసాకు హెవీ డిమాండ్ ఉంటోంది. వీఎఫ్ఎస్ గ్లోబల్ ప్రకారం.. భారతదేశం నుండి హెచ్ 1 వీసా దరఖాస్తులు మొదటిసారిగా కరోనా ముందు స్థాయిని అధిగమించాయి. 2024 మొదటి అర్ధ భాగంలో (జనవరి నుండి జూన్ వరకు).. 2019లో ఇదే కాలంతో పోలిస్తే

మిగతా 2లో..

### బీజేపీలో చేరికలపై పురందేశ్వరి సంచలన వ్యాఖ్యలు!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** వైసీపీ ఎంపీలతోపాటు ఆ పార్టీ నేత, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో నిందితుడు కొల్లం గంగిరెడ్డి బీజేపీలో చేరతారనే వార్తలపై ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సంచలన వ్యాఖ్యలు చేశారు. గంగిరెడ్డిని చేర్చుకుంటున్నామని మేం చెప్పామా అని ఎదురు ప్రశ్నించారు. ఎవరైనా పార్టీలో చేరేందుకు సిద్ధమైనప్పుడు జిల్లా నేతలు చర్చించుకుని రాష్ట్ర నాయకత్వానికి

మిగతా 2లో..

### ప్రజాకోర్టులో తీర్పువచ్చింది.. ఇక విశాఖ కోర్టులోనే తీర్పు రావాలి



- విశాఖ కోర్టుకు నా సొంత ఖర్చులతోనే వచ్చాను
- వైసీపీ రాసలీలల్లో అధికారులు కూడా భాగస్వాములు అయ్యారు
- సాక్షి పత్రికపై పరువునష్టం కేసులో విశాఖ కోర్టుకు హాజరైన మంత్రి నారా లోకేష్
- తదుపరి విచారణ అక్టోబర్ 18కి వాయిదా

**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజాకోర్టులో ఎన్డీయే కూటమికి బ్రహ్మాండమైన తీర్పు వచ్చిందని.. ఇక విశాఖ జిల్లా కోర్టులోనే తీర్పు రావాల్సి ఉందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సాక్షిపై పరువునష్టం కేసులో క్రాస్ ఎగ్జామినేషన్ కోసం గురువారం విశాఖ 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో మంత్రి

మిగతా 2లో..

### పిఠాపురం శక్తి పీఠంలో పసుపు, కుంకుమ చీర పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**పిఠాపురం శక్తి పీఠంలో పంపిణీకి చీరలు అందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**



**పిఠాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** శ్రావణ మాసం చివరి శుక్రవారం పిఠాపురంలోని శక్తి పీఠం శ్రీ పురుహూతిక అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, చీర ప్రసాదంగా అందిస్తారు. ఇందుకోసం అవసరమైన

మిగతా 2లో..

### జగన్‌కి బాగా అర్థమవుతోందా ?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** జగన్ కి రాజకీయం కొత్త కాదు. ఆయన ఇంట్లోనే రాజకీయం ఉంది. పైగా ఆయన గత పదిహేనేళ్ళుగా రాజకీయాల్లో ఉన్నారు. అయినా సరే ఏదో కొత్తగా రాజకీయాలు చేయాలని జగన్ ఎందుకు అనుకుంటున్నారో అర్ధం కాదు, రాజకీయాల్లో ఎపుడూ అవకాశవాదానిదే పెద్ద పీట. ఆ విషయం మరచి తాను పదవి ఇస్తే నమ్ముకుని ఉంటారు అనుకుంటే పొరపాటే అని జగన్ కి ఎన్నో సార్లు ఎన్నో సంఘటనలు

మిగతా 2లో..

### భాషా ప్రాచీనతను కాపాడుకోవాలి



**ముప్పవరపు వెంకయ్యనాయుడు**

**కడప, విశ్వంవాయిస్ న్యూస్ :** భాషా ప్రాచీనతను పరిరక్షించుకోవటంతో పాటు భాష మనుగడను కాపాడుకోవటం అత్యంత ఆవశ్యకమని భారతదేశ గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల మండలంలోని కలమల్లలో.. తొలితెలుగు శిలాశాసనం వెలుగు చూసిన చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో.. గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని

మిగతా 2లో..

### అధికారులకు భారీ సెగ!

**హైడ్రా మరో సంచలన నిర్ణయం!**



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇప్పుడు తెలంగాణలో "హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్" (హైడ్రా) ఎంత హాట్ టాపిక్ అనేది తెలిసిన విషయమే. ఇప్పటికే పలు సంచలన నిర్ణయాలు. వ్యూహాత్మకంగా వాటి అమలుతో హైడ్రా సంచలనంగా మారింది. అక్రమ నిర్మాణం అని తేలితే విరుచుకుపడిపోతుంది. ఈ నేపథ్యంలో మరో సంచలన నిర్ణయం తీసుకుంది. అవును.. తెలంగాణలో అత్యంత హాట్ టాపిక్ గా మారిన హైడ్రా.. చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి సింహ స్వప్నంగా

మిగతా 2లో..

### వైసీసీకి దూరంగా రోజా !



**తిరుపతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్నికల్లో ఓటమితో వైసీపీ ముఖ్యులు ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్నారు. పార్టీకి చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యులు పార్టీ వీడేందుకు సిద్ధమయ్యారు. మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన రావు టీడీపీలో చేరటం దాదాపు ఖాయమైంది. పోతుల సునీత వైసీపీకి రాజీనామా చేసారు. ఇంకా లిస్టులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో మాజీ మంత్రి రోజా పార్టీకి దూరం

మిగతా 2లో..

### అమరావతిలో సీఆర్డీఏ భవనం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

**37 వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించిన మంత్రి నారాయణ**



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ల్యాండ్ పూలింగ్ ద్వారా రాజధానికి భూములిస్తున్న రైతులకు ప్రాధాన్యత ప్రకారం వారి గ్రామాల్లోనే తిరిగి ప్లాట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ..ఇంకా 3వేల 550 ఎకరాలు భూసమీకరణ ద్వారా రైతుల నుంచి సేకరించాల్సి ఉందన్నారు.గతంలో భూములు ఇవ్వని వారు తాజాగా సీఆర్డీఏ కు భూములు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారని చెప్పారు.గత నెల రోజులుగా 120 ఎకరాలు భూమిని రైతులు ల్యాండ్ పూలింగ్ ద్వారా సీఆర్డీఏకు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు..గతంలో

మిగతా 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## మారిపోయాడు

కిషోరీ లాల్ శర్మ చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో వచ్చిన మార్పో ఏమో తెలియదు కానీ స్మృతీ ఇరానీ రాహుల్ పై చేసిన కామెంట్స్ మాత్రం వైరల్ అవుతున్నాయి. రాహుల్ గాంధీ రాజకీయంలో మార్పు వచ్చినట్లు కనిపిస్తోందని స్మృతీ ఇరానీ వెల్లడించారు. తాను గెలుపు రుచి చూసినట్లు భావిస్తున్నాడన్నారు. రాహుల్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కడికి వెళ్లినా కులం గురించి మాట్లాడుతున్నారని, అంతే కాదు రాజకీయాల్లో ఇదెంత కీలకమూ చూపిస్తున్నాడన్నారు. పార్లమెంట్ లో తెల్ల టీషర్ట్ వేసుకుని హాజరు కావడం ద్వారా యువతకు ఓ సందేశం ఇచ్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఇరానీ తెలిపారు. ఇదంతా మనకు నచ్చినా నచ్చకపోయినా భిన్నమైన రాజకీయం చేస్తున్నట్లు మాత్రం అనిపిస్తోందన్నారు.

## రికార్డులు బ్రేక్!

వీసా దరఖాస్తులు 2% పెరిగాయి. అలాగే 2023 మొదటి సగం (జనవరి %-% జూన్)తో పోలిస్తే దరఖాస్తులు 11% పెరిగాయి. హెచ్ 1 వీసాల కోసం ఈ డిమాండ్ కొనసాగుతుందని భావిస్తున్నారు. గత రెండేళ్లుగా పరిస్థితులు చక్కబడ్డాయి. దీంతో హెచ్ 1 వీసాల కోసం దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితి ఈ ఏడాది చివరి వరకు కొనసాగవచ్చని చెబుతున్నారు. కేవలం ఒక్క అమెరికాకే కాకుండా కెనడా, యూకే, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్ దేశాలకు వీసా దరఖాస్తులు పెరుగుతున్నాయని వీఎఫ్ఎస్ గ్లోబల్ వెల్లడించింది. 'మీ ఇంటి వద్దే వీసా' (వీసా యువర్ డోర్ స్టెప్).. సేవ కోసం డిమాండ్ పెరుగుతోంది. ఈ విషయంలోనూ గణనీయమైన వృద్ధి చోటు చేసుకుంటోంది. ఈ విధానంలో వీసా కావాల్సినవారు ఇంటి నుంచే వీసా దరఖాస్తులను సమర్పించవచ్చు. వీసా యువర్ డోర్ స్టెప్ దరఖాస్తులు మునుపటి సంవత్సరంతో పోలిస్తే 2024 మొదటి అర్ధ భాగంలో 16% పెరిగాయి. 2019తో పోలిస్తే 5 రెట్లు పెరగడం విశేషం.

## తెలుగులెస్స

ఎక్కువ మంది మాట్లాడే భాష తెలుగుభాష. అమెరికా లాంటి దేశంలో తెలుగు 11వ భాష అంటే అది తెలుగువారి సత్తా. ఇంగ్లీష్ వస్తేనే మనకు ఉద్యోగాలు, డబ్బులు వస్తాయని భావిస్తున్నారు. ఇటీవల ఈ తరహా పిచ్చి పెరిగింది. ఒక్కోసారి మోసాలు చేస్తున్నారు. అలాంటి అపోహలు నమ్మవద్దు. బాల్యంలో మనమందరం ఎలిమెంటరీ స్కూల్లో చదువుకున్నాం. నాడు ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరిగింది. అయినప్పటికీ విదేశాల్లో రాణిస్తున్నారు. దేశంలో అనేక మంది ఎన్నో ప్రయత్నాలు చేసి మాతృభాషలోనే చదవడం ద్వారా విజ్ఞానాన్ని అర్జించవచ్చని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని స్పష్టం చేస్తున్నారు. ఇంగ్లీష్ నేర్చుకోవాలి. ప్రపంచంలోనే అగ్రజాతిగా తెలుగుజాతి తయారవ్వాలన్నది మనందరి ప్రగాఢ ఆకాంక్ష..అవుతాం. అనుమానం లేదు. ప్రపంచంలో ఏదేశానికి వెళ్లినా ఎక్కువ సంపాదన సంపాదించేది భారతీయులు. అందులో తెలుగువారు 30 శాతం. అది తెలుగుజాతికే గర్వకారణం. తెలుగే చదువుకొని తర్వాత సంపాదన కోసం ఇంగ్లీష్ నేర్చుకున్నారు. ఇక్కడుండే తెలుగువారి కంటే విదేశాల్లోని తెలుగువారికి తెలుగు జాతన్నా, తెలుగు సంప్రదాయాలన్నా, నాగరికత అన్నా, సంస్కృతి అన్నా ఎక్కువ అభిమానం. స్థానికంగా ఉండే తెలుగువారు కూచిపూడి మర్చిపోయారు కానీ అమెరికాలో ఉండేవారు మాత్రం మరిచిపోలేదు. దగ్గరున్న మనం మర్చిపోతున్నాం. విదేశాలకు వెళ్లిన వారికి మాత్రం సంస్కృతి, సంప్రదాయాలు అంటే వల్లమాలిన అభిమానం. తెలుగు కోసం గిడుగు రామ్మూర్తి పంతులు గారు పోరాటం చేశారు. ఆ తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాముల కృషిని మరవలేం. తెలుగు రాష్ట్రం వచ్చిందంటే పొట్టిశ్రీరాములు వల్లే. మదరాసీలుగా పిలువడిన మనం తెలుగుదేశం పార్టీ స్థాపన తర్వాత తాము మదరాసీలం కాదు తెలుగువారం ఒకరున్నాం అని తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు నందమూరి తారకరామారావు. దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు అభివర్ణించారు. తెలుగు భాష కోసం సీపీ బ్రౌన్ లాంటి విదేశస్తులు ఎంతో కృషి చేశారు. తెలుగును అభిమానించారు. నేర్చుకున్నారు. తెలుగును ప్రమోట్ చేసే పరిస్థితికి వచ్చారు. తెలుగు భాషను ప్రమోట్ చేయడంలో ఎన్టీఆర్ తర్వాతే ఇంకొకరు వస్తారన్న విషయం గమనించాలి. తెలుగు భాషను కాపాడటం కోసం, తెలుగు భాష వ్యాప్తి కోసం పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించి పెద్దఎత్తున ప్రయత్నం చేశారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం మైసూర్ లో ఉంటే ఏపీలో పెట్టాలని పోరాడి నెల్లూరు జిల్లా వెంకటాచలం ప్రాంతానికి మార్పించాం. తెలుగు భాషాభివృద్ధి కోసం 2016 సెప్టెంబర్ 14న తెలుగు దేశం పార్టీ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది కార్యక్రమాలు చేయడం జరిగింది. దురదృష్టవశాత్తు గత 5 ఏళ్ల కాలంలో ఉన్న ప్రభుత్వం ఇంగ్లీష్ నేర్చుకుంటేనే జీవితం అన్నట్లుగా మార్చేసింది.

2018లో అమెరికాలో ఉండే భారతీయుల తలసరి ఆదాయం 1,19,00 యూఎస్ డాలర్లు. అదే అమెరికాలోని తెల్లజాతీయుల తలసరి ఆదాయం 65,000 యూఎస్ డాలర్లు. భాషే తెలివి, ఆదాయాన్ని ఇవ్వగలిగితే అమెరికన్లకు ఆదాయం ఉండాలి కానీ భారతీయులకు కాదు. భాష అనేది కమ్యూనికేషన్ కోసం మాత్రమే. మాతృభాషలో అధ్యయనం చేసినప్పుడే విజ్ఞానం వస్తుందన్న విషయం గమనించాలి. ఒకప్పుడు ఇంటికి వస్తే సుమతీ, వేమన శతకాలు చదివేవాళ్లం. తద్వారా నీతిని నేర్చుకునేవాళ్లం. ఇప్పుడు అంతా ఇంగ్లీష్ పోయెమ్స్ నేర్చుకునే పరిస్థితి. తెలుగు భాషను కాపాడుకోవాలని ఎంతో మంది ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు భాషను కాపాడతామని హామీ ఇస్తున్నాం. జీతం కోసం ఆంగ్లం నేర్పిస్తాం.. జీవితం కోసం తెలుగు నేర్పిస్తాం. తెలుగులో మాట్లాడే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లో ముందున్నామంటే అది తెలుగువారి మేధోశక్తికి తార్కాణం. 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం. నేటి ఆదాయానికి, 2047లో వచ్చే ఆదాయానికి చాలా వ్యత్యాసం వస్తుంది. ప్రపంచంలో తెలుగువారు దేనికీ తక్కువకాదు. 2047 నాటికి అంటే స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అయ్యే సందర్భంగా భారతదేశం ప్రపంచంలో అగ్రదేశంగా మొదటి, రెండు స్థానాల్లో ఉంటుంది. భారతదేశంలో ఏపీ ప్రథమస్థానంలో ఉండాలన్న ధ్యేయంతో, ధృఢ సంకల్పంతో ముందుకు వెళ్దాం. నాలెడ్జ్ ఎకానమీలో ఇవన్నీ సాధ్యం. పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉంది. నేను తెలుగు వాడిని, నాది ఆంధ్రప్రదేశ్ అని గర్వంగా చెప్పే రోజు వస్తుంది. రాబోయే తరాలకు ఆదర్శంగా ఉండేలా, రాబోయే రోజుల్లో ప్రపంచం గర్వపడే విధంగా రాజధాని అమరావతి నిర్మాణం అవుతుంది.

జీవో నంబర్ 77 ప్రకారం చాలా మంది తెలుగు పండిట్లకు అన్యాయం జరుగుతుందన్న అంశాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నా దృష్టికి తీసుకువచ్చారు. ఈ జీవో వల్ల లాంగ్వేజ్ పండిట్లు అందరికీ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లలో ఇబ్బందులు వస్తాయని చెప్పారు. తప్పకుండా ఈ అంశంపై అధ్యయనం చేస్తాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అదే విధంగా సూర్యరాయేంద్ర నిఘంటువును రీప్రింట్ చేసే బాధ్యతను తీసుకుంటాం. పూర్తిగా న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నాను. గత ప్రభుత్వం కళాకారులతో పని చేయించుకొని కనీసం డబ్బులు ఇవ్వని దుస్థితి. అలాంటివి అన్నీ సేకరించి క్లియర్ చేస్తాం. స్థానిక కళాకారులు వేరే దేశాలకు వెళ్లి మన కళలను ప్రదర్శించేందుకు, అక్కడి వారు ఇక్కడికి వచ్చేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చర్ రిలేషన్ పనిచేస్తుంది. ఏపీలో ఒక ఎంవోయూ చేసి మన కళాకారులు ప్రపంచమంతా వెళ్లేలా, ప్రపంచంలోని కళాకారులు ఇక్కడికి వచ్చేలా అధ్యయనం చేసేందుకు ఎంవోయూ కుదుర్చుకుంటాం. దీన్ని కూడా ప్రోత్సహిస్తాం. రాష్ట్రంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేంద్రం పెట్టేందుకు కృషి చేస్తాం. సంగీత్ నాటక్ అకాడమీకి ప్రాధాన్యతనిస్తాం. బ్రాంచ్ నెలకొల్పుతాం. మన సంప్రదాయాలను ప్రమోట్ చేసేందుకు కూచిపూడి నృత్యానికి ప్రాధాన్యతనిస్తాం. కూచిపూడి తెలుగుజాతి వారసత్వ సంపద. దాన్ని కాపాడుతాం. తెలుగు జాతి పరిరక్షణ, మనుగడ కోసం కృషి చేస్తున్న కళాకారులను, అవార్డు గ్రహీతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడమే గాకుండా తెలుగుజాతికి పూర్వవైభవం తీసుకొస్తుందని, తెలుగుజాతిని ముందుకు నడిపిస్తుందని, తెలుగు జాతిని కాపాడుకుంటామని తెలియజేసుకుంటున్నాం. భాషను మరిచిపోతే జాతి కనుమరుగు అవుతుందని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. భాష మనకు గుర్తింపునిస్తుంది. భాష విధ్వంసం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేస్తున్నాను. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి గారి సేవలు మరొక్కసారి మనస్ఫూర్తిగా తలుచుకుందాం. ఘనమైన నివాళులు అర్పిద్దాం.

## సంచలన వ్యాఖ్యలు!

ప్రతిపాదనలు పంపుతారని తెలిపారు. ఆ ప్రతిపాదనలను తాము అధిష్టానానికి పంపుతామన్నారు. పార్టీ సిద్ధాంతాలకు, క్రమశిక్షణకు కట్టుబడి ఉండేవారినే బీజేపీలో చేర్చుకుంటామన్నారు. కాగా వైసీపీ ఎంపీలు బీజేపీలో చేరే విషయమై తమకు సమాచారం లేదని పురందేశ్వరి తెలిపారు. గుంటూరులో నిర్వహించిన బీజేపీ కిసాన్ మోర్చా, ఎస్సీ మోర్చా సమావేశాల్లో భాగంగా పురందేశ్వరి పార్టీలో చేరికలపై స్పందించారు. కొల్లం గంగిరెడ్డి పార్టీలో చేరడంపై తాము నిర్ణయం తీసుకోలేదన్నారు. నేతలను చేర్చుకునే అంశంలో అన్ని స్థాయిల్లో చర్చించే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అంగీకరిస్తేనే బీజేపీలో చేర్చుకుంటామన్నారు. వైసీపీ నుంచి ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల చేరికల విషయంలో ఇదే విధానం ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి చేసిన దుష్ప్రచారం వల్లే తమకు 50%-%60 సీట్లు తగ్గాయన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రధాని మోదీ మొదటి సభ్యునిగా పేరు నమోదు చేసుకుంటారని వెల్లడించారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వ నమోదును పెంచేందుకు పార్టీ నేతలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీలో నామినేటెడ్ పదవుల పంపకంపైనా పురందేశ్వరి హాట్ కామెంట్స్ చేశారు. పదవుల పంపకంపైన చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. వైసీపీ రాజ్యసభ ఎంపీల్లో నలుగురు బీజేపీలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. వీరిలో వైసీపీ ముఖ్య నేత విజయసాయిరెడ్డి పేరు కూడా గట్టిగా వినిపిస్తోంది. అలాగే వైసీపీ ఎమ్మెల్సీల్లో కూడా కొందరు బీజేపీలో చేరికకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని టాక్ నడుస్తోంది.

## చీర పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

చీరలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంపించారు. ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పూజలకు హాజరై పసుపు, కుంకుమ, చీరలు అందుకొనే సోదరీమణులకు గురువారం ఆలయం వద్ద టోకెన్లు అందించారు. మహిళలు బారులు తీరి టోకెన్లు తీసుకున్నారు. మూడు బ్యాచులుగా పూజలు నిర్వహిస్తారు. ఆ పూజల్లో పాల్గొనేవారికి పసుపు, కుంకుమతో కూడిన చీరను అందిస్తారు. ఈ మూడు బ్యాచుల్లో పాల్గొనలేనివారికి టోకెన్ ప్రకారం అందించాలని హరిప్రసాద్ అధికారులకు సూచించారు. వీటి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సాగేందుకు భక్తులు సహకరించాలని హరిప్రసాద్ కోరారు.

## అధికారులకు భారీ సెగ!

మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హైడ్రా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా... ఎఫ్.ఎల్.టీ పరిధిలో నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులకు సిద్ధమైంది. ఇందులో భాగంగా... ఇలాంటి అనుమతులు ఇచ్చిన ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్ కు హైడ్రా సిఫారసు చేసింది. ఇదే సమయంలో హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ అథారిటీలో అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారుల లిస్ట్ ను ప్రిపేర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి నగరంలో చాలా మంది చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన విషయం ప్రభుత్వాలకు, అధికారులకు తెలియంది కాదనే చెప్పాలి. అయితే ఈ విషయంలో అధికారుల అలసత్వమో.. లేక, మరేదైనా కారణమో కానీ అవిరామంగా అక్రమ నిర్మాణాలు హైదరాబాద్ లో జరిగాయని అంటుంటారు. అంటే.. ఈ పాపంలో అధికారులదీ భాగం ఉందన్నమాట! దీంతో... అక్రమ నిర్మాణాలు చేపట్టినవారే కాదు.. నిబంధనలకు నీళ్లొదిలి వారికి సహకరించిన అధికారులపైనా హైడ్రా దృష్టి సారించింది. ఆయా ప్రాంతాల్లో పనిచేసిన అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వహించడంలో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో.. ఆ అధికారుల లెక్క తేల్చాలని హైడ్రా ఫిక్సయ్యిందని అంటున్నారు. కాగా.. ఇప్పటివరకూ 18 ప్రాంతాల్లో చిన్నా పెద్దా అంతా కలిపి సుమారు 200 కు పైగా నిర్మాణాలను హైడ్రా కూల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సుమారు 50 ఎకరాల వరకూ చెరువుల భూములను, ప్రభుత్వ భూములను పరిరక్షించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇన్ని అక్రమ నిర్మాణాలను అనుమతులు ఇచ్చిన అధికారులపైనా దృష్టి సారించినట్లు సమాచారం.

## అర్ధమవుతోందా ?

చెబుతున్నా ఇంకా తత్వం అర్థం కాలేదా అన్నది చర్చగా ఉంది. జగన్ తన రెక్కల కష్టంతో 2014లో 67 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుంటే వారిలో 23 మందిని అప్పటికి టీడీపీ లాగేసింది. జగన్ మాత్రం అధికారంలోకి వచ్చాక తాను అలాంటి పనులు చేయను అని ఒట్టు పెట్టారు. సరే టీడీపీ నుంచి ఒక నలుగురు జనసేన నుంచి ఒకరు ఎమ్మెల్యే వచ్చి అనుబంధంగా కూర్చుకున్నారు. అప్పటికి సంతోషం ఏమిటి అంటే వారికి జగన్ ఏనాడూ కండువాలు కప్పలేదు. ఇక జగన్ టీడీపీ ఎమ్మెల్సీలను ఎవరినీ ఆకర్షించాలని ప్రయత్నం చేయలేదు. కానీ మూడేళ్ల తరువాత మండలిలో వైసీపీ బలం పెరిగింది. ఇపుడు మెజారిటీ ఉంది. ఒక విధంగా చూస్తే వైసీపీకి ఇదే పెద్ద దిక్కుగా ఉంది. అలాగే రాజ్యసభలో పదకొండు మంది ఎంపీలు ఉన్నారు. వీరిని చూసుకుని జగన్ బలం గా ఉన్నారని అనుకోవచ్చు. కానీ సరిగ్గా ఇక్కడే అవసరం అవకాశం కలసి రాజకీయం చేస్తాయని జగన్ ఎందుకు ఊహించుకోలేక పోయారో అర్థం కాదు. రాజకీయాల్లో అవసరాలతో అవకాశాలు ఏర్పడతాయి వాటిని వాడుకున్న వారే రాజకీయం నేర్చిన వారు. అంతే తప్ప మడి కట్టుకుని కూర్చున వారు కారు. ఇది నయా నీతి ఏ మాత్రం కాదు, ఇప్పటికి మూడు వేల సంవత్సరాల క్రితం చాణక్యుడే చెప్పిన రాజనీతి.

## వైసీపీకి దూరంగా రోజా !

అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీని పైన రోజా ఈ రోజు చేసిన ట్వీట్ తో క్లారిటీ వచ్చింది.

**రోజా అడుగులు :** వైసీపీలో ముఖ్యులు పక్క పార్టీల వైపు చూస్తున్నారు. జగన్ బెంగళూరులో ఉన్నారు. పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు టీడీపీ ముఖ్యులతో టచ్ లోకి వెళ్లారు. ఇద్దరు ఎంపీలు పార్టీ వీడటం ఖాయమైంది. ఇదే సమయంలో మాజీ మంత్రులు సైతం పార్టీ వీడుతున్నారంటూ కొద్ది రోజులుగా ప్రచారం సాగుతోంది. మాజీ మంత్రి రోజా వైసీపీ వీడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. రోజా తన సోషల్ మీడియా ప్రొఫైల్ లో జగన్ తో ఉన్న ఫొటో తొలిగించటంతో ఇక వైసీపీకి రాజీనామా ఖాయమనే ప్రచారం ప్రారంబమైంది.

**వైసీపీలో ఉంటారా :** రోజా ఏపీలో రాజకీయాల్లో వేరే పార్టీలో చేరుతారనే వాదన తెర మీదకు వచ్చింది. అదే సమయంలో రోజా తమిళనాడులో హీరో విజయ్ స్థాపించిన తమిళ్ వెట్రి కళగం ద్వారా రోజా అక్కడ రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ మరి కొన్ని వార్తలు తెర మీదకు వచ్చాయి. వైసీపీ ఫైర్ బ్రాండ్ గా వ్యవహరించిన రోజా ఇప్పుడు ఈ స్థాయిలో తాను వైసీపీ వీడుతున్నారంటూ ప్రచారం సాగుతున్న వేళ మౌనంగా ఉంటున్నారు. ఎక్కడా ఈ వార్తలను ఖండించలేదు. సోషల్ మీడియా ద్వారానూ స్పందించలేదు.

**రోజా ట్వీట్తో :** అయితే, ఈ ప్రచారం వేళ రోజా ఈ రోజున చేసిన ట్వీట్ అన్నింటికీ సమాధానంగా భావిస్తున్నారు. మాజీ సీఎం జగన్, భారతిలకు ట్విట్టర్ వేదికగా పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నేళ్లు గడిచినా చెదరని మీ అనుబంధం, ఇలాగే కలకాలం కొనసాగాలని ఆశిస్తూ.. హృదయపూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలంటూ విష్ చేశారు రోజా. ఈ ట్వీటం ద్వారా తాను జగన్ ను ఇప్పటికీ అన్నగానే భావిస్తున్నట్లు స్పష్టం చేసారు. వైసీపీ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రోజా మంత్రిగానూ పని చేసారు. తాజా ఎన్నికల్లో ఓడిన తరువాత గ్యాప్ తీసుకున్నారు. రోజా తాజా ట్వీట్ వైరల్ గా మారింది.

## ఇక విశాఖ కోర్టులోనే తీర్పు రావాలి

హాజరయ్యారు తదుపరి విచారణను కోర్టు అక్టోబర్ 18కి వాయిదా వేసింది. "చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి" పేరుతో సాక్షి పత్రిక 2019 అక్టోబర్ 22న అసత్య కథనం ప్రచురించింది. దీంతో అవాస్తవాలతో తన ప్రతిష్టను ఉద్దేశపూర్వకంగా దిగజార్చారంటూ నారా లోకేష్ సాక్షి పత్రికపై రూ.75 లక్షలకు పరువునష్టం దావా వేశారు.

**టీడీపీకి అధికారం కొత్త కాదు :** కోర్టు విచారణ అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. గతంలో వైకాపా ప్రభుత్వం వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే నాపై సాక్షి విశాఖ ఎడిషన్ లో అవాస్తవాలతో కూడిన కథనం ప్రచురించారు. విశాఖ ఎయిర్ పోర్ట్ లో తాను టీ, కాఫీల కోసం రూ.25 లక్షలు ఖర్చుచేశానని రాశారు. సాక్షి పత్రికలో పెట్టుబడులు మొత్తం వైఎస్ కుటుంబానివే. ఢిల్లీలో ఉన్న వీక్లీ మేగజైన్ కూడా అసత్యాలతో కూడిన కథనం ప్రచురించింది. దీనిపై ఆధారాలతో సహా ఇరువురికి లీగల్ నోటీసులు పంపించడం జరిగింది. బిల్లులు జనరేట్ అయిన 26 రోజుల్లో నేను ఒకే ఒక్క రోజు విశాఖలో ఉన్నానని స్పష్టంగా చెప్పడం జరిగింది. వీక్లీ మేగజైన్ తన తప్పుడు కథనంపై రీజాయిండర్ వేశారు. క్షమించమని కోరారు. సాక్షి పత్రిక మాత్రం ఒప్పుకోలేదు. దీంతో రూ.75 లక్షలకు సాక్షి పత్రికపై పరువునష్టం దావా వేశాను. టీడీపీకి అధికారం కొత్త కాదు. ప్రజాధనం దుర్వినియోగం చేయవద్దని మా నాయకుడు చంద్రబాబునాయుడు గారు పదేపదే చెబుతారు.

**విశాఖ కోర్టుకు నా సొంత ఖర్చులతోనే వచ్చాను :** గతంలో నేను మంత్రిగా ఉన్నప్పుడు కూడా నా సొంత వాహనాలనే వినియోగించాను. వాటర్, టీ ఖర్చుకు కూడా నేను డబ్బులు చెల్లించాను. ఇప్పుడు మంత్రి అయిన తర్వాత, ఈ రోజు కూడా నా సొంత వాహనంలోనే వచ్చాను. డీజిల్ ఖర్చు కూడా నా జేబు నుంచే చెల్లిస్తున్నాను. విమానానికి కూడా నా సొంత డబ్బులే ఖర్చు పెట్టాను. ఒక కప్పు కాఫీ తాగను, ఒక బాటిల్ నీళ్లు కూడా ప్రభుత్వం నుంచి ఏనాడూ తీసుకోలేదు. నా తల్లిదండ్రులు నాకు నేర్పిన విలువలు అవి. బుధవారం రాత్రి కూడా విశాఖ పార్టీ కార్యాలయంలో నా సొంత బస్సులోనే నిద్రించాను. జగన్ రెడ్డి మాదిరిగా ఫైవ్ స్టార్ హొటళ్లు మేం వినియోగించం. సిగ్గులేకుండా ఇప్పుడు కూడా సాక్షి పత్రిక తరపున వచ్చిన న్యాయవాదులు వాదనలు వినిపించడం చాలా బాధాకరం. చిన్నబాబు చిరుతిండి రూ.25 లక్షలంటూ కథనంలో ఆరేడుసార్లు నా పేరు ప్రస్తావించారు. ఆ డబ్బును చంద్రబాబుగారి అకౌంట్ లో వేశానని కూడా రాశారు. ఒక కథనం ప్రచురించే ముందు పరిశోధన చేయాలి. నా స్టాండ్ తీసుకుని ఉంటే వాస్తవాలు చెప్పేవాడిని. సొంత బాబాయిని జగనే లేపేసి నారాసుర రక్త చరిత్ర అంటూ సాక్షిలో అసత్య కథనం ప్రచురించారు. దీనికి ఫుల్ స్టాప్ పడాలనే డిఫమేషన్ సూట్ వేశాను.

**జగన్ రెడ్డిలాగా నాకు ప్రజాధనం లూటీ చేయడం రాదు :** జగన్ రెడ్డిలాగా నాకు ప్రజాధనం లూటీ చేయడం రాదు. దాదాపు రూ.700 కోట్లు ఖర్చు పెట్టి రుషికొండలో విలాసవంతమైన ప్యాలెస్ పెట్టారు. సర్వే రాళ్లపై జగన్మోహన్ రెడ్డి బొమ్మ కోసం సుమారు రూ.900 కోట్లు దుర్వినియోగం చేశారు. అడ్డగోలుగా ప్రజాధనాన్ని లూటీ చేశారు, ఖర్చు చేశారు. నాడు-నేడు ఎప్పుడూ ఆ విధంగా తెలుగుదేశం పార్టీ చేయదు. క్రమశిక్షణతో మేం మొదటి నుంచీ పనిచేస్తున్నాం. ప్రజల కోసం కష్టపడతాం.

**విశాఖను ఏఐ కేపిటల్ గా తీర్చిదిద్దుతాం :** చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారు. పలువురు ఐటీ పారిశ్రామికవేత్తలు నన్ను కలిశారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. 2019లో అదానీతో ఒప్పందం కుదుర్చుకుని సోలార్ ఎనర్జీ, డేటా సెంటర్ తీసుకురావడం జరిగింది. ఆ రోజు ఎగతాళి చేశారు. ఇవాళ మహారాష్ట్రకు, తెలంగాణకు తరలివెళ్లాయి. అందరితో మళ్లీ చర్చించాం. విశాఖను ఏఐ కేపిటల్ గా తీర్చిదిద్దుతాం. విశాఖలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భూఅక్రమాలపై విచారణ పూర్తిచేసి నివేదికను తదుపరి కేబినెట్ లో పెట్టడం జరుగుతుంది. అన్ని భూఅక్రమాలు బయటకు తీస్తాం. జగన్ రెడ్డి మొదటి నిర్ణయమే ఏకపక్షంగా ప్రజావేదికను కూల్చారు. సింగపూర్ ప్రభుత్వంతో చర్చించకుండా ఏకపక్షంగా ఒప్పందాన్ని రద్దు చేశారు. లులూ ప్రాజెక్టును తరిమికొట్టారు. అందరినీ ఒప్పించి పరిశ్రమలు తీసుకువస్తాం. పెట్టుబడులు తీసుకురావడంతో పాటు ప్రజలకు సంక్షేమం కూడా అందిస్తాం.

**విశాఖ స్టీల్ ను కాపాడతాం :** విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపడతామని హామీ ఇవ్వడం జరిగింది. కేంద్రంతో ఇప్పటికే చర్చించాం. దీనిపై సమీక్షించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు. గత ప్రభుత్వం చేతగానితనం వల్ల పరిశ్రమకు కష్టాలు వచ్చాయి. గత ప్రభుత్వంలో మద్యం, ఇసుక, మైనింగ్ కుంభకోణాలు జరిగాయి. అవన్నీ బయటకు తీస్తాం. అక్రమ కట్టడాలు ఉంటే అధికారులు చర్యలు తీసుకుంటారు. ఐదేళ్లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటించాం.

## కాపాడుకోవాలి

జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహిస్తున్న తెలుగుబాషా దినోత్సవ వేడుకలకు.. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే చడిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితి సింగ్, డిఎఫ్ఓ సందీప్ రెడ్డి, బిజెపి యువనాయకులు భూపేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సందర్భన ద్వారా ఓ మహోన్నత ప్రాచీన భాషకు వారసునిగా గర్విస్తున్నానని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ గర్వపడాలని సూచించారు. చొరవ తీసుకుని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కలెక్టర్ సహా ప్రతి ఒక్కరినీ ఆయన మనసారా అభినందించారు. ఇదే వేదిక నుంచి శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారికి నివాళులు అర్పించిన వెంకయ్యనాయుడు, తెలుగును ప్రజల పరం చేసేందుకు, భాషను సౌకర్యవంతంగా, సరళంగా మార్చుకునే దిశగా వారి కృషిని గుర్తు చేసుకున్నారు. శ్రీ గిడుగు గారి స్ఫూర్తితో యువతరం తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. తెలుగు భాష ఎంత ప్రాచీనమైనదో, మన సంస్కృతి కూడా అంతే ప్రాచీనమైనదన్న ఆయన... మాతృమూర్తి, మాతృభూమి, మాతృభాషే మన అస్తిత్వమని తెలిపారు. భారతదేశంలో నాలుగో అతిపెద్ద భాషగా మన్ననలు అందుకుంటున్న తెలుగు, ప్రపంచ వ్యాప్తంగా మరెన్నో దేశాల్లోనూ తన ప్రాభవాన్ని చాటుతున్న విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఉత్తమ లిపిగా, అజంతా భాషగా తెలుగు అందుకున్న గౌరవాలను ప్రస్తావించారు. తెలుగు లాంటి మహోన్నత భాష ప్రాచీనతకు శిలాశాసనాలు సాక్ష్యంగా నిలుస్తాయన్న వెంకయ్యనాయుడు, శాసనాలను రాళ్లు, రప్పలుగా గాక మన సంస్కృతికి సంబంధించిన గొప్పలుగా చూడాలని ఆకాంక్షించారు. శాసనాల ప్రాచీనత మీద వ్యక్తమౌతున్న సందేహాల విషయంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్న ఆయన, ఇలాంటి శాసనాల భాష మీద ఆసక్తి పెంపొందే విధంగా చొరవ పెరగాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. శాసనాల పరిరక్షణ విషయంలో తమిళనాడును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్న ఆయన, తెలుగు భాష పరిరక్షణ, శాసనాలను సంరక్షణ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు.


## త్వరితగతిన పూర్తి చేయాలి

ల్యాండ్ పూలింగ్ కు భూములిచ్చిన వారికి లాటరీ విధానంలో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేవారు..తాజాగా భూములిచ్చిన వారికి ప్రస్తుతం సీఆర్డీఏ వద్ద ఉన్న భూముల్లో ప్రాధాన్యత ప్రకారం రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు...సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 37 వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు..ముఖ్యంగా మూడు అంశాలపై అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు..వీటిలో ఒకటి ల్యాండ్ పూలింగ్ రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు అంశం. ఇక రెండో అంశంగా రాజధానిలో నిర్మాణంలో ఉన్న సీఆర్డీఏ భవనంపై చర్చించారు.. రాయపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్డును ఆనుకుని సీఆర్డీఏ కార్యాలయాన్ని ప్రభుత్వం నిర్మిస్తుంది...ఈ భవనం నిర్మాణానికి 160 కోట్లు కేటాయిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.మొత్తం 3.62 ఎకరాల్లో జీ ప్లస్ 7 విధానంలో భవనం నిర్మిస్తున్నారు..ఈ భవనం నిర్మాణం పూర్తయితే సీఆర్డీఏ,ఏడీసీతో పాటు మొత్తం మున్సిపల్ శాఖకు చెందిన అన్ని విభాగాలు ఇక్కడి నుంచే పనిచేస్తాయన్నారు...దీనివల్ల పాలన సులభం అవుతుందని చెప్పారు మంత్రి..ఈ భవనం నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని అన్నారు.సీడ్ క్యాపిటల్ లో మొత్తం 14.46 ఎకరాల్లో జీ ప్లస్ 18 అంతస్తులు ఉండేలా మొత్తం 12 టవర్లను నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్నయించింది...దానికి తగ్గట్లుగా ఆన్ లైన్ లో బుకింగ్ ప్రారంభించగానే కేవలం గంటలోనే అన్ని ఫ్లాట్లు బుక్ అయిపోయాయని...714 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టగా గత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ ను నిలిపివేసిందన్నారు..దీంతో ఫ్లాట్లు బుక్ చేసిన వారు నష్టపోకుండా ఈ ప్రాజెక్ట్ ను తిరిగి చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు..అయితే గత ఐదేళ్లుగా ప్రాజెక్ట్ చేపట్టకపోవడంతో 713 కోట్లతో పూర్తికావలసిన ప్రాజెక్ట్ విలువ 930 కోట్లకు పెరిగిపోయింది..అయినా సరే ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారు నష్టపోకూడదనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు గత ప్రభుత్వం కౌలు చెల్లించలేదని మంత్రి నారాయణ ఆరోపించారు.గత ఏడాది కౌలు నిధులు 175 కోట్లు,ఈ ఆర్థిక సంవత్సరంలో 225 కోట్లు బకాయి ఉందన్నారు...అయితే గత ఏడాది ఇవ్వాల్సిన 175 కోట్ల నిధులను వచ్చే నెల 15 లోగా రైతుల ఖాతాల జమ చేసేలా సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారన్నారు.

# ఎడిటర్ వాయిస్

## పాలనలో పారదర్శకత

ప్రభుత్వ ఉత్తర్వు (జిఓ)ల సమాచారాన్ని ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా గవర్నమెంట్ ఆర్డర్స్ ఇష్యూ రిజిస్టర్ (జిఓఐఆర్) వెబ్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగినది. ఈ నిర్ణయంతో కీలకమైన ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. జిఓఐఆర్ పోర్టల్ కొత్తదేం కాదు. ఈ వెబ్ పోర్టల్ 2008లో మొట్టమొదట ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చింది. అంతకు ముందు వరకు వివిధ అంశాలపై జిఓలను సంపాదించడం ఒక పెద్ద ప్రహసనంగా ఉండేది. ప్రభుత్వ ఉత్తర్వులు అమలులోకి వచ్చిన నెలల తరువాత కూడా సామాన్యులకు అవి అందుబాటులోకి వచ్చేవి కావు. జిఓఐఆర్ వెబ్‌పోర్టల్ ఆవిష్కరణతో ఆ ఇబ్బందులు కొంత మేర తప్పాయి. రాజశేఖరరెడ్డి అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాధి నేతలు కూడా దీనిని కొనసాగించారు. అయితే, జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది. 2021 ఆగస్టు 15 నుండి జిఓఐఆర్ వెబ్ పోర్టల్‌ను నిలిపి వేసింది. దీంతో ప్రజలతో సంబంధం ఉన్న అనేక ప్రభుత్వ నిర్ణయాలు గుట్టుచప్పుడు కాకుండా అమలులోకి రావడం ప్రారంభమైంది. దీనిపై ప్రజానీకంతో పాటు పలు తరగతుల ఉద్యోగుల్లో సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరకు హైకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలిచ్చినా ఫలితం దాదాపు శూన్యమే! తాజాగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జిఓఐఆర్ వెబ్‌పోర్టల్‌ను నేటి (గురువారం) నుండే ప్రజలకు అందుబాటులోకి ఉంచాలని నిర్ణయించింది.అయితే, జిఓఐఆర్ వెబ్‌పోర్టల్ పునరుద్ధరణతోనే పాలనలో నూరు శాతం పారదర్శకత వచ్చేసినట్లు, జవాబుదారీతనానికి పెద్దపీట వేసినట్లు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదు. నిజానికి ఇది ఆ దిశలో ఒక అడుగు మాత్రమే! గతంలో జిఓఐఆర్ పోర్టల్ ఉన్నప్పటికీ 'కాన్ఫిడెన్షియల్' జిఓలు జారీ అయ్యాయి. గత ప్రభుత్వం కొంత కాలంపాటు ఈ పోర్టల్‌లోనే ఖాళీ పేజీలను ఉంచింది. అందువల్ల పోర్టల్ పునరుద్ధరణతోనే పారదర్శకత వచ్చేసినట్లు కాదు. దానిలో అన్ని రకాల జిఓలను ఏమాత్రం దాపరికం లేకుండా ప్రభుత్వం విడుదల చేయగలగాలి. అప్పడు కూడా పారదర్శకత వచ్చినట్లు కాదు. 'పాలనలో పారదర్శకత' అంటే మరింత విశాలమైన అర్ధంతో కూడుకున్నది! పారదర్శకత సుపరిపాలన యొక్క ప్రధాన సూత్రం. పారదర్శకత అంటే కేవలం సమాచారాన్ని పంచుకోవడం మాత్రమే కాదు. మరింత 'ఓపెన్'గా వ్యవహరించడం! అంటే, తీసుకున్న నిర్ణయాలను తెలియచేయడం మాత్రమే కాదు! నిర్ణయాలు తీసుకోక ముందే చర్చించడం. నిర్ణయాలను ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? ఆ ప్రతిపాదన మీద ఎవరెవరు ఎలా స్పందించారు? భవిష్యత్ పరిణామాలేంటి అన్న అంశాలను కూడా అందుబాటులోకి ఉంచడం! కచ్చితమైన సమాచారాన్ని సకాలంలో, సంపూర్ణంగా, బాధ్యులైన వారి ద్వారా ప్రజలకు అందించడం కూడా సుపరిపాలనలో భాగమే! అప్పుడే ఆ సమాచారాన్ని పౌరసమాజం సమర్ధవంతంగా వినియోగించగలుగుతుంది. ఒక్క జిఓ లకే కాదు. అన్ని రకాల ప్రభుత్వ నిర్ణయాలకు, కార్యక్రమాలకూ ఇది వర్తిస్తుంది. అంతర్రాష్ట సమస్యలు, కేంద్రం నుండి ప్రత్యేకహొదా, విభజన హామీల సాధన మొదలు రాజధాని నిర్మాణం వంటి అంశాలను అఖిలపక్షంలో చర్చించి అన్ని రాజకీయ పార్టీలు, సంస్థల ఉమ్మడి అభిప్రాయాన్ని సాధించడం కూడా పారదర్శక పాలనలో భాగమే. ఈ విషయంలో కోవిడ్, వరదల వంటి వాటితో పాటు ఇటీవల వయనాడ్ విలయం వరకు అనేక సందర్భాల్లో కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఆదర్శం. విశాఖలో భూ కబ్జాలపై గతంలో టిడిపి తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వాలు ప్రత్యేక దర్యాప్తు బృందాల్ని (సిట్) నియమించాయి కాని వాటి నివేదికలను బహిర్గతం చేయలేదు. ఇప్పటికైనా వాటిని వెల్లడించాలి. కార్మికుల ప్రాణాలు బలిగొంటున్న ప్రమాదాలు, వాటిని అరికట్టడానికి వివిధ కమిటీలు చేసిన సిఫార్సులు లోకానికి తెలియాలి. ఇలా ప్రజలకు అవసరమైన ప్రతి అంశం (దేశ భద్రతకు ముప్పు ఉంటే తప్ప) ప్రజల ముందుకు రావాలి. విస్తృతంగా చర్చ జరగాలి. అలా జరిగేట్టు చూసే బాధ్యత ప్రభుత్వానిదే! పారదర్శకతకు పట్టం, జవాబుదారీతనానికి పెద్ద పీట అప్పుడే!



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# క్రీడల పట్ల పాలకుల నిర్లక్ష్యం ఇంతింత కాదయా!



భారత హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ 119వ జయంతి నేడు. ఆయన గౌరవార్థం ఆగష్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రపంచంలో అత్యధిక ప్రజాదరణ పొందిన అత్యున్నత క్రీడా పోటీల్లో ఒలింపిక్స్ ఒకటి. మన దేశం అధికారికంగా 1900 సంవత్సరం ఒలింపిక్స్‌లో ప్రవేశించింది. నాటి నుంచి 25 ఒలింపిక్స్‌లో పాల్గొంటే 41 పతకాలు సాధించగా ఇందులో 16 పతకాలు హర్యానా క్రీడాకారులు పొందటం మరో విశేషం. ఈ ఏడాది పారిస్‌లో జరిగిన 33వ ఒలింపిక్స్ క్రీడా పోటీల్లో మనం 6 పతకాలతో 71వ స్థానంలో నిలిచాం. ఇప్పటి వరకు 30 సార్లు ఒలింపిక్స్ జరిగితే మొదటి స్థానంలో అమెరికా 19 సార్లు నిలవగా, సోవియట్ యూనియన్ 7 సార్లు నిలిచింది. ఈసారి కూడా అమెరికా, చైనా పోటాపోటీగా తలపడి మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. క్రీడల పట్ల మన పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ఈ లెక్కలు చూస్తే తెలుస్తుంది.

**క్రీడాభివృద్ధికి నిధులేవీ?** బీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో క్రీడలకు నిధులు కేటాయించడంలో గానీ లేదా ఖర్చు చేయడంలో గానీ చాలా అలసత్వం, ప్రాధాన్యత లేని అంశంగా చూడటమే క్రీడాకారులకు నేడు శాపంగా మారింది. గత పదేళ్లుగా కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే 2014-15లో రూ.1769 కోట్లు కేటాయించగా ఇది వరుసగా రూ.1943, రూ. 2197, రూ. 2596, రూ. 2776, రూ.2826 కోట్ల రూపాయలు కేటాయించారు. 2024-25లో రూ.3442 కోట్లు. గతేడాది కన్నా రూ.45 కోట్లు పెంచారు. దీన్నిబట్టి చూస్తే బడ్జెట్‌లో జిడిపి పెరుగుదల ద్వారా పెరగడం తప్ప పాలకులు క్రీడలకు ఇచ్చిన ప్రాధాన్యత ఏమీ లేదని అర్థం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అత్యున్నత క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు తీసుకొచ్చిన ఖేలో ఇండియా పథకం దక్షిణాది రాష్ట్రాల పట్ల తీరని వివక్షత చూపుతోంది. బిజెపి పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, ఇతర రాష్ట్రాలకు మరో న్యాయం చూపిస్తున్నది. ఖేలో ఇండియా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.2168 కోట్లు ఖర్చు చేస్తే ఇందులో గుజరాత్‌కు రూ.426 కోట్లు, ఉత్తరప్రదేశ్‌కు రూ.438 కోట్లు, అరుణాచల్ ప్రదేశ్‌కు రూ.148 కోట్లు, రాజస్థాన్‌కు రూ.107 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.94 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.21 కోట్లు, తెలంగాణకు రూ.18 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. **ఎ.పి లో క్రీడా విధానం ఏదీ? :** "పతకం కొట్టు జాబ్ పట్టు" అంటూ హర్యానా, పంజాబ్, కేరళ, తమిళనాడు, ఒరిస్సా లాంటి రాష్ట్రాలు వున్నంతలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం క్రీడల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది. జీవో నెంబర్ 74 ప్రకారం ప్రతి ఉద్యోగంలో 4 శాతం కోటాను నిజాయితీగా అమలు చేస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం క్రీడలకు మరింత గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్ర బడ్జెట్లో క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయించకుండా టూరిజం, యువజన సర్వీసుల శాఖ పేరుతో కలిపి నిధులు కేటాయించడం జరుగుతుంది. బడ్జెట్లో నిధులు చూపించినా ఖర్చు చేయడం లేదు. ఒక వేళ ఖర్చు చేస్తే అవి క్రీడలకు ఖర్చు చేయడం లేదు. 2006లో హర్యానా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తెచ్చి దేశానికి క్రీడా పోటీల్లో ఆదర్శంగా నిలిచింది. పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ప్రతి గ్రామంలో మినీ స్టేడియాలను నిర్మిస్తే మన రాష్ట్రంలో నియోజకవర్గ కేంద్రాలకే దిక్కు లేదు. అక్కడ నియోజకవర్గ కేంద్రాల్లో స్పోర్ట్స్ స్కూల్ నిర్మిస్తే మన పాలకులు మాత్రం విజయనగరం జిల్లాలో ఉండే స్పోర్ట్స్ స్కూల్‌ను మూసివేసి క్రీడల పట్ల తమ 'నిజాయితీ'ని నిరూపించుకున్నారు! ఎ.పి లో గతంలో 'హ్యాపీ సండే' పేరుతో అయినా ఏదో ఒక కార్యక్రమం జరిగేది. ఇప్పుడు అది కూడా ఆగిపోయింది. 175 నియోజక వర్గాల్లో తక్షణమే మినీ స్టేడియాలను, క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

**స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) :** శాప్ పరిధిలో పదిహేను మంది పర్మినెంటు కోచ్‌లు కూడా లేరంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఔట్ సోర్సింగ్ కింద ఉన్న 97 మంది కోచ్‌లకు సరైన వేతనాలు లేక, సమయానికి ఇవ్వక, అధికారుల ఒత్తిడి కారణంగా, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి గురించి ఆలోచించకుండా క్రీడలు ఎలా అభివృద్ధి అవుతాయి? కాంట్రాక్ట్ కోచ్‌లను పర్మినెంటు చేయడానికి శాప్‌కు వచ్చిన ఇబ్బందులు ఏమిటి? కొత్తగా మరో 500 మంది కోచ్‌లను నియమించకుండా రాష్ట్రంలో క్రీడా అభివృద్ధి సాధ్యమా? గత మూడేళ్లుగా జాతీయ క్రీడల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు పెండింగ్‌లో ఉన్నాయి. బంగారు పతకానికి 5 లక్షలు, వెండి పతకానికి 3 లక్షలు, కాంస్యానికి 1 లక్ష రూపాయలు ఇవ్వాలని శాప్ నిబంధనలు ఉన్నాయి. మరి ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వడం లేదు. ఇచ్చినా సగం మాత్రమే ఎందుకు ఇస్తున్నారు. మిగతా సగం ఎప్పుడు ఇస్తారో ఎవరికి తెలియదు. పథకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహానికే నిధులు లేకపోతే క్రీడా అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుంది? రాష్ట్రంలో అత్యున్నత క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు క్రీడాకారులకు శిక్షణా, క్రీడా సామగ్రి సమకూర్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేయడం శాప్ ఉద్దేశం. కానీ నేడు దానికి భిన్నంగా నేడు శాప్ వ్యాపారం చేస్తుంది. క్రీడా మైదానాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియాలను, స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం జరుగుతుంది. దీంతో క్రీడాకారులు గ్రౌండ్‌లో అడుగు పెట్టాలంటే డబ్బు చెల్లించి రావాల్సిన పరిస్థితి. శాప్ అధికారులు ఇప్పటికైనా వ్యాపారం మాని క్రీడాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయకపోతే క్రీడలు బతకవు. యువతను క్రీడల వైపు నడిపిస్తేనే సమాజం బాగుపడుతుంది. ఎక్కువ భాగం యువత డ్రగ్స్ వైపు, గంజాయి వైపు పోతూ నిర్వీర్యం అవుతుంటే మనకి బాధ్యత లేదా. తప్పకుండా యువత క్రీడల వైపు పయనించాలి. మాయమైపోతున్న క్రీడలను భుజం భుజం కలిపి రక్షించుకోవాలి. మన దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలు తప్పనిసరిగా ఉండాలనేది చేయలేకపోతున్నం. మన రాష్ట్రంలోనే వేల సంఖ్యలో పి.ఇ.టి, పి.డి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు పది వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలో ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు లేడని గణాంకాలు చెబుతున్నాయి. విద్యార్థులకు క్రీడలు ఎలా నేర్పుతారు? ఎవరు నేర్పుతారు? ఇంక కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలయితే సరేసరి. ఉదయం నుంచి రాత్రి వరకు బట్టి చదువులు తప్ప ఇంకేమీ ఉండదు. ప్రభుత్వం అన్ని సబ్జెక్టుల మాదిరిగా వ్యాయామ విద్య కూడా ఒక సబ్జెక్టుగా చేసి మార్కులు ఇస్తే గానీ క్రీడలు బాగుపడవు. అలాగే తల్లిదండ్రులకు గేమ్స్ వల్ల ఉపయోగాలు, అవకాశాలపై అవగాహన కల్పించాలి. క్రీడలు కేవలం గెలుపు కోసం కాదు. ప్రైజ్ మనీ కోసం కాదు. ఉద్యోగంలో కోటా కోసమూ కాదు. క్రీడలు స్నేహ సంబంధాలు నెలకొల్పి తద్వారా ఐక్యతను పెంచుతాయి. మానసిక ఉల్లాసం ఇస్తాయి. చదువుల పట్ల ఒత్తిడి తగ్గిస్తాయి. దేహ దారుఢ్యం పెంచుతాయి. శారీరక వ్యాయామం అనేక వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. నేడు యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను తిప్పి కొట్టడానికి క్రీడలు ఒక ఆయుధంగా పని చేస్తాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ఎస్.జి.ఎఫ్.ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) సర్టిఫికెట్‌కు మంచి విలువ ఉంది. ఇప్పుడు ఇది కూడా పక్కదారి పడుతున్నది. అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కారణం ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం. వీరు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో గేమ్స్ నిర్వహించడం జరుగుతుంది. కానీ దీనికి ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వడం లేదు. రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు విద్యార్థులే పెట్టుకోవాల్సి వస్తుంది. దీంతో వారు అక్కడే అగిపోతున్నారు. కొంతమంది వ్యాయామ ఉపాధ్యా యులు తమ ఖర్చుతో తీసుకుపోతున్నారు. ఇది ఎంతకాలం సాధ్యం అవుతుంది. జిల్లా పరిషత్ హైస్కూల్లో కనీసం స్పోర్ట్స్ మెటీరియల్ కూడా లేని పరిస్థితిలో ఉంటే క్రీడలు ఎలా అభివృద్ధి అవుతాయో పాలకులే చెప్పాలి. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి. ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు క్రీడా పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి బస్సు, ట్రైన్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను పెంచాలి. ప్రతి విద్యాసంస్థలో వ్యాయామ విద్య తప్పనిసరి సబ్జెక్టు చేసి మార్కులు ఇవ్వాలి. క్రీడాభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక అమలు చేయాలి. అన్యాక్రాంతమైన క్రీడా మైదానాలను కాపాడాలి. క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభి మానులు, యువజన సంఘాల అభిప్రాయాలతో స్పోర్ట్స్ పాలసీ ప్రకటించాలి. అదే హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్‌కి అర్పించే నిజమైన నివాళి.




# చిట్టి.. దాని మిత్రులు




'రాత్రి నాకు నువ్వు కుక్క పిల్లను తెచ్చిచ్చినట్టు కలచ్చింది' అంది తన గదిలోంచి ఆవలిస్తూ బయటకు వొచ్చిన చిట్టి. ఫోన్ చూసుకుంటున్న నాన్న అది పక్కన పెట్టి నవ్వుతూ దగ్గరకు తీసుకున్నాడు చిట్టిని. 'మనం కుక్క పిల్లలు, పిట్టలు, చేపలు పెంచుకుందామే' అంది నాన్న పక్కన కూర్చొని వూరికే పేపర్ తిరగేస్తూ. నాన్నా, అమ్మా ఇద్దరూ ఒక్కసారి భయంగా మొహాలు చూసుకున్నారు. 'అలాగే గానీ నువ్వు వెళ్లి టూత్ పేస్టు తినేసిరా' అన్నాడు నాన్న. 'నేను టూత్ పేస్టు తినను, బ్రష్షు చేసుకుంటా' అంది చిట్టి. 'అది కాదు చిట్టీ.. మొన్ననే మన పంజరంలో వున్న చామంతి, మైక్‌లను రాత్రి పూట పిల్లి వొచ్చి తినేసింది! నువ్వు రెండు రోజులు ఒకటే ఏడుపు' అంది అమ్మ. 'అవును, అప్పుడు సరిగా అన్నం కూడా తినలేదు' అన్నాడు అమ్మకు వంత పాడుతూ నాన్న. 'ఇది బుజ్జి కుక్కపిల్ల నాన్న.. దానికేం కాదు' అంది నాన్న ఫోన్ తీసుకొని. టక.. టకా ఫోన్‌నొక్కి తన బుజ్జి కుక్కపిల్ల ఎలా ఉంటుందో, ఎలాంటిది కావాలో చూపించింది. 'ఏదీ నాకూ చూపించు అంది' అమ్మ. చిట్టి మూడో తరగతి చదువుతుంది. పొద్దున్న స్కూలుకు వెళ్లి మూడు గంటలకల్లా ఇంటికి వొచ్చేస్తుంది. సాయంత్రం పాలు తాగి బిస్కెట్లు తింటుంది. కాసేపు పడుకుంటుంది. లేచిన తరువాత అమ్మా, నాన్నలతో కలిసి కార్టూన్ చానెల్స్ చూసి నవ్వుతుంది. ఇంక ఆ తరువాత అమ్మా, నాన్న ఎవరి పనుల్లో వారు వుంటారు. చిట్టికి ఏమీ తోచదు. కాసేపు పుస్తకాలు తిరగేస్తుంది, బొమ్మలతో ఆడుకుంటుంది. అందుకే నాన్నతో పేచీ పెడితే నాన్న కొన్ని చేపపిల్లలు తెచ్చి ఒక బౌల్‌లో వేసాడు. రోజూ వాటికి మేతవేసి వాటితో మాట్లాడుతూ వాటికి పేర్లు పెట్టి ఆడుకునేది. ఒక వేసవి కాలం, బయట ఎండలు సల సల కాగిపోయాయి, ఆ రాత్రంతా ఉక్కపోత. పొద్దున లేచి చూసేసరికి చేపలు చనిపోయాయి. చిట్టి ఒకటే ఏడుపు, అమ్మా నాన్నకి ఊరుకోబెట్టడం కష్టమైపోయింది. ఇంతకు ముందు చామంతి, మైక్ అనే చిన్ని పక్షులు ఇంట్లో ఉండేవి. రోజూ పొద్దున్నా, సాయంత్రం వాటితో కబుర్లు చెప్పేది, ఫోన్‌లో వాటికి ఫోటోలు తీసేది. అమ్మయితే వాటికి 'గుడ్ ఈవెనింగ్ చాము, గుడ్ ఈవెనింగ్ మైక్' అని చెప్పేది. అవి కిల కిలా గెంతేవి. వాటికి తాగడానికి నీళ్లు పెడితే అందులో దూకి స్నానం చేసేవి. ఎప్పుడైనా వూరు వెళితే ఆ రెండురోజులు అవి ఎలా ఉన్నాయో అని అందరికీ టెన్షన్. తిరిగి ఇంటికి వొచ్చి వాటి క్షేమం చూసుకుంటేగాని మనసు కుదుటపడేది కాదు.

హమ్మయ్య.. మీరు ఊరి నుంచి వొచ్చేసారు మాకదే చాలు అన్నట్టు అందరినీ చూసి అల్లరి చేసేవి అవి. ఒక రోజు రాత్రి అందరూ పడుకున్నప్పుడు కిటికీలోంచి ఒక పిల్లి దూరి వాటిని నోట కరుచుకుపోయింది. పొద్దుట లేచేసరికి అమ్మకి ఒకటే గాబరా. మూసిన పంజరం మూసినట్లే వుంది, కాకపొతే బోర్లా పడిపోయింది. చాము, మైక్ ఏమై పోయాయో అని ఇంట్లోనూ, బయట వెతికింది. నాన్న కూడా వెతుకుతూ వంట గదిలో పిల్లి అడుగు మట్టి గుర్తులు చూపించాడు. ఆరోజు పొద్దున్న చిట్టికి తెలీనివ్వలేదు, ఏదో మాటల్లో పెట్టేసి స్కూలుకు పంపించేసారు. 'పోనీ వేరేవి తెచ్చి పెట్టనా' అన్నాడు నాన్న. 'వొద్దండీ చాము, మైక్ కావాలని ఏడుస్తుంది. ఎలాగో నచ్చచెబుదాం లెండి' అంది అమ్మ. ఆ సాయంత్రం చిట్టి కనిపెట్టేసింది. ఇంకేముంది కిందపడి ఒకటే దొర్లడం, ఏడుపు. నాన్న చెప్పాడు 'ఆహార గొలుసులో అది భాగం. మనం పిల్లిమీద కోపం పెట్టుకోలేము. కిటికీ వేయకపోవడం మన తప్పు. అందులోంచి అది దూరి వొచ్చేసింది' అని. అదిగో అప్పటినుంచి చిట్టి గొడవ మరీ పెరిగి పోయింది. కుక్క పిల్లను పెంచుకుందాం.. బుజ్జి కుక్కపిల్లను పెంచుకుందాం అని. రోజూ ఫోన్లో ఫోటోలు చూపిస్తూ 'ఇదిగో ఇలాంటిది కావాలి, ఇది కావాలి, ఇదెంత బుజ్జిగా ఉందో కదా, కొంటావు కదా నాన్నా' అని ఒకటే బతిమాలటం. నాన్నకు అమ్మకూ కూడా తేవాలనే వుంది. గాని ఈ అద్దె ఇంట్లో దానిని పెంచడం ఎలా! ఇంటి ఓనర్లు ఒప్పుకోరు. రోజులు అట్లా మెల్లగా గడుస్తున్నాయి. ఒక రోజు నాన్న ఉత్సాహంగా ఇంటికి వొచ్చాడు. 'నాకు ట్రాన్స్ఫర్ అయ్యింది' అన్నాడు. 'ఎక్కడికండీ?' అంది అమ్మ. నాన్న చెప్పాడు. 'అబ్బ! యెంత అందమైన వూరికి' అంది కళ్ళు పెద్దవి చేసి. సామాన్లు లారీలో వెళ్లిపోగా చిట్టి, అమ్మ, నాన్న వెనక కారులో చిన్ని సూట్ కేసులతో బయలుదేరారు. ఈ కొత్త వూరు బాగుంది. ఇల్లు ఇంకా బాగుంది. ఇంటి చుట్టూ కొబ్బరి, అరటి, సపోటా, సీతాఫలం మొక్కలు, రేఖ, ముద్ద మందారం మొక్కలు, గోరింటాకు చెట్లు వున్నాయి. మరుసటి రోజు పొద్దున్నే చిట్టిని నిద్రలేపాడు నాన్న. 'ఇంకా కొత్త స్కూలులో జాయిన్ అవ్వలేదు కదా, నేను లేవను' అంది చిట్టి. 'అయితే నేను వెళ్తున్నా, అక్కడొక కుక్కపిల్ల వుంది కలిసి వస్తాను' అన్నాడు నాన్న. వెంటనే చిట్టి రెడీ అయిపోయింది. నాన్నతో వెళ్ళడానికి. అక్కడొక కాలువ పారుతోంది. అందులో చుక్కల చేపలు చాలా వున్నాయి. నీళ్లు తేటగా వున్నాయి. చిట్టి తన చేతిలో వున్న బిస్కట్ ప్యాకెట్ చించి ఒక బిస్కెట్ ముక్కచేసి వేయబోయింది. అలా చేయకూడదు అన్నాడు నాన్న. 'ఇక నుంచి ఇవి మన ఫ్రెండ్స్ రోజూ పొద్దున్నే వొచ్చి చూసి వెళతాము' అన్నాడు. 'సూపర్' అంది చిట్టి. అక్కడొక తోట దగ్గర ఆగారు. అక్కడికి రామచిలుకలు, వడ్రంగి పిట్టలు, గోరింకలు, తేనె పిట్టలు, కొండ పిచ్చుకలు వున్నాయి. అవ్వన్నీ పోటా పోటీగా అరుస్తున్నాయి. ఎగురుతున్నాయి. తిరిగి వస్తుంటే దారిలో రెండు చిన్ని కుక్క పిల్లలు దగ్గరకి వొచ్చాయి. చిట్టి తన దగ్గరున్న బిస్కెట్లు వేసింది వాటికి. అవి కుయ్యుమ్.. కుయ్యుమ్ అని తోక ఊపుతూ చిట్టి చుట్టూ తిరగసాగాయి. దూరంగా వాటి తల్లి నిలబడి వుంది. చిట్టి, నాన్న ఇంటికి వెళుతుంటే అవి ఇంటి వరకు కూడా వొచ్చేసాయి. ఆ రోజు ఆఫీసుకు వెళుతూ 'మరి కుక్క పిల్ల కొని తేనా చిట్టి?' అని అడిగాడు నాన్న. 'వద్దు, ఇక్కడ మన ఫ్రెండ్స్ చాలా వున్నాయిగా. రోజూ వాటిని పలకరిస్తాం కదా' అంది నాన్నకు టాటా చెప్తూ. అవును. వాటిని అలా స్వేచ్ఛగానే తిరగనివ్వాలి అని చిట్టికి ముద్దిచ్చి వెళ్ళిపోయాడు నాన్న.

# ఏకవస్తు చింతన!!

ప్రపంచంలో అనేక వస్తువులున్నాయి. బల్ల, కుర్చీ, పుస్తకం, కలం, ఇల్లు, నగలు, ఆకాశం, కొండలు, నదులు.. ఇలా ఎన్నో. ఆ వస్తువులను చూడటానికి, వాటి గురించి తెలుసుకోవటానికి మన వద్ద ఇంద్రియాలున్నాయి. మనోబుద్ధులున్నాయి. అంటే అనేక వస్తువులు ప్రపంచంలో ఉన్నాయి. వాటిని తెలుసుకొనే అనేక ఇంద్రియాలున్నాయి. మనస్సులో అనేక ఆలోచనలున్నాయి. బుద్ధిలో అనేక కోరికలున్నాయి. అయితే వీటన్నింటిని తెలుసుకొనేవాడు, మార్పు చెందేవాటన్నింటి యొక్క మార్పులను తెలుసుకుంటూ ఉండేవాడు మాత్రం ఒక్కడే. తానెప్పుడూ మార్పు చెందకుండా ఉంటాడు. అతడే ఆత్మ. అతడెప్పుడూ ఒక్కడే. అందుకే ఆత్మ ఏక వస్తువు. లడ్డు కొద్దిగా నోట్లో వేసుకొని చూసావు. అది తీపిగా వుంది, చింతకాయ కొరికావు. పుల్లగా ఉంది, వేపకాయ రుచిచూచావు. చేదు, మిరపకాయ కొరికావు. కారంగా ఉంది, వీటన్నింటిని తెలుసుకొనే నీ ఏం ఉంది? తీపి ఉందా? కారం ఉందా? పులుపు ఉందా? ఇవేవీ లేవు. కాని ఆయా వస్తువులలో ఉన్న రుచి ఏదో తెలుసుకొనే తెలివి ఉంది. అంటే తెలియబడే తీపి, పులుపు, కారం, చేదు అవేవి నేను కాదు. వాటిని తెలుసుకొనే తెలివిని నేను. అంటే ప్రజ్ఞను. జ్ఞానాన్ని. ఈ జ్ఞానం ఏకం. ఎప్పుడూ మారేది కాదు. రెండు రకాల జ్ఞానాలు లేవు. తీపిని తెలుసుకొనే జ్ఞానం ఒకటి, కారాన్ని తెలుసుకొనే జ్ఞానం ఒకటి ఇలా లేదు. వున్నదంతా ఒక్కటే జ్ఞానం. ఆ జ్ఞానమే ఆత్మ. అదే నేను. దాన్నే చింతన చేయాల్సింది. ఈ ఏక వస్తుచింతనం వల్లనే మనో నాశం జరుగుతుంది. ఎలా చేయగలం ఈ ఏక వస్తు చింతనం ? నీకన్న వేరుగా ఉన్న ఈ ప్రపంచాన్ని గురించిగాని, వ్యక్తుల గురించి గాని, పక్షుల గురించి గాని, శరీరాన్ని గురించి గాని, మనోబుద్ధుల గురించి గాని ఇలా దేన్ని



గురించైనా సరే చక్కగా చింతన చేయగలం, చేస్తున్నాం కూడా. అయితే ఆత్మనైన నన్ను నేను చింతన చేయాలంటేనే కుదరటం లేదు. ఆత్మ చింతనం అనేది చాలకష్ట సాధ్యంగా ఉంది. కనుక దీనిని నీకు నీవుగా తెలుసుకోవటం కుదరదు. నీవు మనోబుద్ధుల స్థాయిలో ఉన్నావు గనుక వాటికి అందినంత వరకే చింతన చేయటం కుదురుతున్నది. ఆ స్థాయిని దాటి పోవాలంటే చేయాలి? "యత్ స్వతహా అప్రాప్యం తత్ శాస్త్రేన బోధితవ్యం" అని శంకర భాష్యం. ఏది నీకు స్వతహాగా లభించదో దానిని శాస్త్ర బోధ ద్వారానే గ్రహించాలి. శాస్త్రాన్ని అందించేవాడు గురువు. గురువు అంటే జ్ఞానం తానైనవాడు. వెలుగుతున్న దీపంలాంటి వాడు. వెలుగుతున్న దీపం ఎన్నిదీపాలనైనా వెలిగించగలదు. అలాగే గురువులోని జ్ఞానం శిష్యుని బుద్ధిని ప్రచోదనం చేస్తుంది. గురుబోధను గ్రహించటం వల్ల శిష్యుడు దేదీప్యమానంగా జ్ఞానంతో ప్రకాశిస్తాడు. అలా గురుబోధ ద్వారా జ్ఞానాన్ని పొందినవారే ఏకవస్తు చింతనం చేయగలుగుతారు. అయితే ఈ గురుబోధను గ్రహించాలంటే మానసిక ప్రశాంతత కావాలి. బుద్ధి సూక్ష్మత కావాలి. ఏకాగ్రత కావాలి. ఇలాంటి మానసిక ప్రశాంతత మనోలయం జరిగినప్పుడే కలుగుతుంది. ఈ మనోలయం అనేది ప్రాణాయామం ద్వారా లేదా వాయునిరోధనం ద్వారా సాధించవచ్చు. అంటే వాయు నిరోధనం లేదా ప్రాణాయామం ద్వారా మనోలయం. మనోలయం వల్ల మానసిక ప్రశాంతత. ప్రశాంతంగా ఉన్నప్పుడే గురుబోధను గ్రహించగలం. గురుబోధవల్లనే జ్ఞానం, ఏకవస్తువు గురించిన జ్ఞానం కలిగితేనే ఏకవస్తు చింతనం. ఆ ఏక వస్తు చింతనం వల్ల మనోనాశనం. ఇదీ వరస. ఇలా మనోనాశం సాధిస్తే ఇంతవరకు ఉన్న నానాతం అదృశ్యం. ఇంతవరకు మనస్సుతో చూసావు గనుక అనేకత్వం ఉంది. ఇప్పుడు మనస్సు నాశనమైనది గనుక అనేకత్వానికి ఆస్కారం లేదు. అంతటా ఆత్మదర్శనమే. ఏకత్వ దర్శనమే.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం/ ఆగస్టు/30/2024




www.viswamvoice.com

# తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

**తెలుగు భాషను విస్మరించడం తగదు.. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో గ్రంథాలయ సంస్థలు ఏర్పాటు చేయాలి**

**డాక్టర్ టీ.కే.విశ్వేశ్వరరెడ్డి, పడాల వీరభద్రరావు**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగు భాషను విస్మరించడం తగదని తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని రాజమహేంద్రి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టీ.కే.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం), రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలో టీ.కే.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగు భాషను వాడుక భాషగా ప్రజల జీవభాషగా ముందుకు తీసుకువెళ్లారని అన్నారు. అందుకే రామమూర్తి జయంతి రోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. మాతృభాష తెలుగు భాషను విస్మరించడం అంటే కన్నతల్లిని కించపరచడమేనని, తెలుగు భాష చాలా గొప్పదని, తెలుగు పదాలు మాతృమూర్తి పాల వంటివని టీ.కే. అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా పునరుద్ధరించాలని అవసరమైతే దీనికోసం ఉద్యమం కూడా సాగిస్తామని టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. తూ.గో.జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు భాష మసకబారుతున్నదని, తెలుగు భాషను పరిరక్షించుకోవలసిన అవసరం ఆసన్నమైందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న గ్రంథాలయాలను బలోపేతం చేయాలని, రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించిన అన్ని జిల్లాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని, ఉమ్మడి తూ.గో.జిల్లా విభజింపబడిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో, తూ.గో.జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో జిల్లా గ్రంథాలయ సంస్థలు ఏర్పాటు చేయాలని పడాల వీరభద్రరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. సత్య సౌందర్య, రచయితలు నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. ఆర్.ఎస్.వరహాల దొర, గండి స్వామి





ప్రసాద్, ఎస్.ఆర్.పృథ్వి, డా. పి.వి.బి.సంజీవరావు, డా.బిహెచ్.వి.రమాదేవి, మల్లెమొగ్గల గోపాలరావు, లోలభట్టు శ్రీనివాసరాజు, గొట్టిముక్కల అనంతరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావు, ఏ. రామకృష్ణ, ముండూరి మల్లికార్జునరావు, అంబడిపూడి కృష్ణ దత్తాత్రేయ శర్మ, రాజమహేంద్రి కళాశాల తెలుగు ఉపాధ్యాయులు ఏ.ఎల్.సావిత్రి, కే.లక్ష్మి, విభూతి బ్రదర్స్ కళాకారిణి వీర్నాల సుబ్బలక్ష్మిలను శాలువ కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. తొలుత రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అరసం జిల్లా కార్యవర్గ సభ్యురాలు తేతలి సత్య సౌందర్య జ్యోతి ప్రజ్వలన చేయగా...కళాశాల విద్యార్థినులు ప్రార్థనా గీతం ఆలపించారు. జనవిజ్ఞాన వేదిక తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ముండూరి మల్లికార్జునరావు మాతృభాష తెలుగులోనే మాట్లాడాలని, తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలని ప్రమాణం చేయించారు. విభూతి బ్రదర్స్ జానపద కళాకారులచే విభూతి శ్రీనివాసరాజు బృందం మాతృభాష, తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తిపై పాడిన పాటలు సభను ఆకట్టుకున్నాయి. చివరగా పడాల వీరభద్రరావు వందన సమర్పణ చేశారు.

## పల్స్ హాస్పిటల్, హార్ట్ ఇన్స్టిట్యూట్ అండ్
# సూపర్ స్పెషాలిటీ ఘనంగా ప్రారంభం


**అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక సౌకర్యాలతో సామాన్యులకు పల్స్ హాస్పిటల్**

**అందుబాటులో తక్కువ ధరలకే ఆధునిక టెక్నాలజీతో వైద్య సేవలు**

**గుండె,ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ఒకే చోట వైద్య సేవలు**

**డాక్టర్ గూడూరి శ్రీనివాస్ డాక్టర్ కందుల సాయి వెల్లడి**








**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పేద, మధ్యతరగతి, సామాన్యులకు అందు బాటులో పల్స్ హాస్పిటల్ ప్రారంభించినట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ కందుల సాయి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రాజమండ్రి తిలక్ రోడ్ లోని పల్స్ హాస్పిటల్ హార్ట్ ఇన్స్టిట్యూట్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కందుల సాయి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్లు మాట్లాడుతూ రాజమండ్రి రూరల్ దివాన్ చెరువులో ఉన్న విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్కు అను బంధంగా పల్స్ హాస్పిటల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుండె ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన హాస్పిటల్ నగరంలో అందు బాటులో ఉండాలని సదుద్దేశంతో తిలక్ రోడ్డులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్స్ హాస్పిటల్లో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణరాజు, ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు లక్ష్మణ్, డాక్టర్ అన్విష్, డాక్టర్ హితేష్ చరణ్ హాస్పిటల్ లో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. అత్యాధునికమైన పరికరాలతో వైద్య సేవలు పేద, మధ్యతరగతి, సామాన్యులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువ డాక్టర్లు హైదరాబాద్ రాజమండ్రి వంటి నగరాలలో ప్రముఖ హాస్పిటల్ లో వైద్య సేవలు అందించిన అనుభవం ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక సౌకర్యాలతో హాస్పిటల్ ఏర్పాటు చేశారని అన్నారు. వైద్యం కోసం హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాలకు వెళ్లకుండా రాజమండ్రిలోనే ఆధునిక వైద్య సేవలు పొందవచ్చునని అన్నారు. తూర్పు పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు ఈ హాస్పిటల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. తక్కువ ధరలకే ఆధునిక టెక్నాలజీతో వైద్య సేవలు అందిస్తున్నారని వీటిని రాజమండ్రి తో పాటు పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.



## పసలపూడి చైతన్యలో తెలుగుభాష, జాతీయ క్రీడా
# దినోత్సవం వేడుకలు

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పసలపూడి శ్రీ చైతన్య పాఠశాలలో తెలుగు భాష , క్రీడా దినోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. భాష ఉద్యమానికి ఆద్యులు బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు రామ్మూర్తి విశ్వవిఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జన్మ దినాన్ని పురస్కరించుకుని తెలుగు భాష దినోత్సవం జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కె. రాము మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని భాష ఆవశ్యకతను వివరించారు. అదేవిధంగా విద్యార్థుల మనోవికాసానికి ఆటలు కూడా ముఖ్యమైనవి అని ఆయన తెలియజేశారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు క్రీడా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు తెలుగు సాంప్రదాయ దుస్తులతో తెలుగు తల్లి వేషధారణతో గిడుగు రామ్మూర్తి వేషధారణతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య మండపేట రీజినల్ ఇంచార్జ్ ఎం .లక్ష్మీ నరేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు భాష విశిష్టతను క్రీడలు ఉపయోగాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో డీన్ భాగ్యరాజు ,సి- ఇంచార్జ్ చారి ,ప్రైమరీ ఇంచార్జ్ రత్నవల్లి ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ వెంకటలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవం

**కోచ్ కుంచె రమేష్‌కు సత్కారం**



**మండపేట టౌన్ విశ్వంవాయిస్ న్యూస్ :** ఎందరో జాతీయ అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన మండపేటకు చెందిన కోచ్ కుంచె రమేష్‌ను ఘనంగా సత్కరించారు. క్రీడా దినోత్సవం సందర్భం గా డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆయనకు అవార్డు అందజేశారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు. రమేష్ 2008 నుండి వరుసగా టెన్నికయిట్‌లో నాలుగు నేషనల్‌లో విజయం సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోచ్‌గా ఎంతోమందికి శిక్షణ ఇచ్చారు. 62 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఆయన శిష్యులు 23 మంది జాతీస్థాయిలో పాల్గొన్నారు. ఇద్దరు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్నారు. దేశానికి రాష్ట్రానికి మండపేట కు ప్రతిష్టలు సంపాదించేలా రమేష్ తన స్థాయికి మించి వారికి శిక్షణ ఇవ్వడం విశేషం. అంబేద్కర్ కోనసీమ కలెక్టర్‌చే గౌరవ పురస్కారాన్ని రమేష్ అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వీరేశలింగం పంతులు వారి
# ఆశయాలు నెరవేరుద్దాం

**టౌన్ హాల్ ను అభివృద్ధి పరిచి పూర్వ వైభవాన్ని తెచ్చే విధంగా కృషి చేస్తాం**

**టౌన్ హాల్ సందర్శనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** వీరేశలింగం పంతులు ఆశయాలకు అనుగుణంగా నగరంలోని టౌన్ హాల్ ను అభివృద్ధి పరిచి పూర్వ వైభవాన్ని తీసుకురావడం జరుగుతుందని నగర శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నగరం లోని టౌన్ హాల్ ను శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు స్థానిక కూటమి నాయకులు వై శ్రీను, కురగంటి సతీష్ తదితర నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాచుర్యం పొంది ఎన్నో కార్యక్రమాల నిర్వహణకు వేదికైన టౌన్ హాల్ నేడు దయనీస్థితిలో ఉందని, దానిని పునరుద్ధరింపచేసి వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందని అన్నారు. వీరేశలింగం పంతులు మంచి ఆలోచనతో సామాజిక కార్యక్రమాలకు, మహిళా సాధికారత లక్ష్యంగా వారి ఆస్తులను అందించారని పేర్కొన్నారు. నగరంలో ఉన్న టౌన్ హాల్ చాలా దయనీయ పరిస్థితిలో ఉందన్నారు. వీరేశలింగం పంతులు ఆస్తులు కొన్ని దేవాదాయ శాఖలోనూ, మరి కొన్ని విద్యాశాఖలోనికి విలీనం చేయటం జరిగిందని ఈ రెండు శాఖల సమన్వయ లోపం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కళలకు ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందించడంతో పాటు కళాకారుల ప్రతిభను కనబరిచే విధంగా వారి ప్రదర్శనలకు ఈ ప్రాంగణం ఎంతో ఉపయోగపడాలనే సంకల్పంతో ప్రభుత్వం నుంచి సుమారు రూ. 65 లక్షల రూపాయలు, కార్పొరేషన్ నుంచి మరి కొన్ని నిధులు కలిపి మొత్తం కోటి 15 లక్షల రూపాయలతో టౌన్ హాల్ అభివృద్ధికి గత టిడిపి ప్రభుత్వ అయాంలో మంజూరు చేసి పనులను ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో టౌన్ హాల్ అభివృద్ధికి ఎంత మాత్రం ముందుకు రాలేదన్నారు. ట్రస్ట్ సభ్యులు వీరేశలింగం పంతులు ఆస్తుల సంరక్షణకు మరిన్ని సమావేశాలు నిర్వహించి వాటి అభివృద్ధికి కృషి చేయాలని, ఇందులో ప్రభుత్వ పరంగా ఎన్డీఏ కూటమి కూడా తమ వంతు సహకారాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే పుష్కరాలు నాటికి వీరేశలింగం పంతులు ఇల్లు, టౌన్ హాల్ అభివృద్ధి చేసి గత 100 సంవత్సరాల చరిత్ర కలిగి... ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న అనేక పుస్తకాలను, చరిత్రలో తమకంటూ ఒక స్థానాన్ని కల్పించుకున్న అనేకమంది ప్రముఖుల ఫోటోలను ఇక్కడ ప్రదర్శించటం వలన భవిష్యత్ తరాలకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. వీరేశలింగం పంతులు గత వైభవాన్ని భావితరాలకు తెలియచెప్పే విధంగా వారి ఇల్లు, టౌన్ హాల్ అభివృద్ధి పై ట్రస్ట్ సభ్యులతో సమీక్షించి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. స్థానిక నాయకులు, అధికారులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ అండ్ పీ.జీ. కళాశాలలో
# జాతీయ క్రీడా దినోత్సవం




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గురువారం ఉదయం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి మహిళా జూనియర్ డిగ్రీ పీజీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రి మహిళా కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ సీఈసీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని కుమారి పొక్కునూరి లక్ష్మీ వల్లి సాయి సంజనను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి మరియు ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్యలు శాలువా కప్పి మెమెంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి కే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ మన భారతదేశం ప్రపంచంలోనే అతి ఎక్కువగా జనాభా ఉన్న దేశం అయినా సరే ఇటీవల పారిస్ లో జరిగిన ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించకపోవడం మన దురదృష్టం అని రాజమండ్రి చుట్టుపక్కల ఏడు లక్షల మంది జనాభా ఉన్న వారికి ఆడుకోవడానికి సరైన క్రీడా మైదానాలు లేవు అని నేటి రోజులలో గవర్నమెంట్ స్కూలులో పనిచేస్తున్న పి ఈ టి లు పిల్లలకు ఆటలు నేర్పడం కాకుండా వారిని లైనులలో పంపే ఒక వాచ్మెన్ లా పనిచేస్తున్నారు అని తూర్పుగోదావరి జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఉన్నా సరే దానిలో ఇద్దరు కోచ్ లు మాత్రమే ఉండడం దురదృష్టకరమని ప్రతి గవర్నమెంటు మరియు ప్రైవేటు స్కూలుల లో ఉన్న విద్యార్థులకు నెలకు ఏదో ఒక క్రీడా పోటీలు నిర్వహిస్తే తన వంతు సహాయంగా వారికి ప్రయోజనాలు ఇతర సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాను అని విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. సంజన జిల్లా స్థాయి బ్యాట్మెంటన్ పోటీలలో పాల్గొని మంచి ప్రతిభను కనపరుస్తుందని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య అన్నారు.రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ పరచాలని ఆకాంక్షించారు. బ్యాట్మెంటన్ క్రీడాకారిణి సంజన మాట్లాడుతూ మా రాజమహేంద్రి మహిళా కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం చాలా ఆనందకరం అని తను ఎంచుకున్న బ్యాట్మెంటన్ క్రీడలో ఇంకా మంచి ప్రతిభ కనబరిచి ముందడుగు వేసి తన కళాశాలకు మరియు రాజమహేంద్రవరం నగరానికి మంచి పేరు తీసుకుని వస్తాను అని తెలియజేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు ఎన్.ఎస్.ఎస్. పి.ఓ.లు ఎం.కే.ఎస్. ప్రసాద్ దంటు వీర వెంకట్రావు ఎన్.ఎస్.ఎస్. క్లర్క్ కే. సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# జానపద కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

**తూర్పు గోదావరి అధ్యక్షుడుగా వీరనాల రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎడవల్లి సుబ్రహ్మణ్యం**

**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ జానపద కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎల్ఆర్ కృష్ణబాబు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ తూర్పుగోదావరి జిల్లా కో ఆర్డినేటర్ విభూతి లోవరాజు సమక్షంలో తూర్పుగోదావరి జిల్లా కళాకారుల నూతన సంఘం ప్రారంభం ఈ కార్యక్రమానికి ఎల్ ఆర్ కృష్ణ బాబు జంగారెడ్డిగూడెం వారు జిల్లా జానపద కళాకారులు పాల్గొన్నారు. స్థానిక కొవ్వూరు గోపాద క్షేత్ర సన్నిధిలో తూర్పుగోదావరి జానపద కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనాల రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు నందం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎడవల్లి సుబ్రహ్మణ్యం, దూబచర్ల, ఉపకార్యదర్శిగా మిరియాల రమణారావు,కోశాధికారి కొయ్య సుందర్ సింగ్, ముఖ్య సలహాదారులు విభూతి లోవరాజు ,ఈ సంఘం ద్వారా వృద్ధ కళాకారులకు, పెన్షన్, కళాకారుల గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ పథకాలపై ప్రచారానికై ప్రోగ్రామ్స్ నిమిత్తమై కృషి చేస్తానని వీరనాల రాజకుమార్ తెలిపారు.



## ద్వారపూడిలో తెలుగు భాష దినోత్సవం



**ద్వారపూడి, విశ్వంవాయిస్ న్యూస్ :** ద్వారపూడి జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా తెలుగు భాషా పండితులు గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్‌విఆర్ ఫౌండేషన్ తరపున సుంకర నాని బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయురాలు బి విజయ జ్యోతి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ ,వైస్ చైర్మన్ కోటా దేవి, మాజీ సర్పంచ్ మండ వీరభద్రరావు, జనసేన నాయకులు చింతా శ్రీనివాసరావు, కోట లక్ష్మణ్ గేదెల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బూరాడ భవాని శంకర్ 57వ జయంతి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సేవాభిలాషి మాజీ కార్పొరేటర్ బూరాడ భవాని శంకర్ 57వ జయంతి స్థానిక 48వ డివిజన్ సంజీవ నగర్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో మాజీ కార్పొరేటర్ బూరాడ కృష్ణమాధురి, కుమారుడు స్వామి అర్చన్ ,గంగాధర్,ప్రసీద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థిని విద్యార్థులకు కేకులు మ్యాజిక్ ట్యాబ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి. ఝాన్సీ లక్ష్మి, సతీష్ బాబు, సీతారామయ్య స్వర్ణలత, శారదా దేవి తదితరులు పాల్గొన్నారు. భవాని శంకర్ మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో నాలుగు ఫ్యాన్లు నాలుగు చూపులైట్లు బూరాడ భవాని శంకర్ పేరుమీద బహూకరించారు. అనంతరం సంజీవయ్య నగర్ పనసచెట్టు సెంటర్ వద్ద భవాని శంకర్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్ కట్ చేసి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూరాడ భవాని కృష్ణమాధురి కుమారుడు స్వామి అర్చన్,కోడి కోట, సి. హెచ్. రాజు, ప్రసీద, చక్రపాణి ఎస్.కె. దుర్గ, దేవేంద్ర, సిహెచ్ రవి, బంకపల్లి చిన్ని, చెల్లారావు, తోరట లక్ష్మణరావు, నాగు, ఎం రవి, పండు, ఉమా, సతీష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు భాషే మూలం




**రాజానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భాష లేకపోతే సమాజం లేదు. జాతి లేదు. మానవ మనుగడే లేదు. సమాజం సృష్టించబడాలి అంటే అందుకు ప్రధాన సాధనం భాషే. జాతి యొక్క బలం అభివృద్ధి భాషతోనే సాధ్యం అని డాక్టర్ పివిబి సంజీవరావు అన్నారు. గెట్ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ముందు తరాలకు తెలుగు అందించాలంటే భాషను ఆధునికరించడంతో పాటు, సృజనాత్మకత దిశగా అడుగులు వేయాలని కోరారు. తెలుగు భాష, సంస్కృతి, సాంప్రదాయాల, పట్ల ప్రతి ఒక్కరు గౌరవం కలిగి ఉండాలని కోరారు. అప్పుడే భాష అభివృద్ధి దశగా ముందుకు వెళుతుందని అన్నారు. తెలుగు మాధ్యమంలో చదువుతున్న వారి పట్ల చిన్నచూపు తగ్గదని, అన్నారు. భాషను బ్రతికించే విషయంలో ప్రతి ఒక్కరు అహంభావాలు పక్కన పెట్టి సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వల్లి మాధవి మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు సంస్కారం నేర్పించాలి అంటే అది సంస్కృతితోనే సాధ్యం అని అన్నారు. సంస్కృతి కేవలం తల్లి భాషతోనే అలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలలో గిడుగు రామ్మూర్తి పుట్టినరోజు సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రారంభ గీతం శ్రీలక్ష్మి బృందం పాడారు. ఈ కార్యక్రమానికి డా.బి హెచ్.వి.రమాదేవి స్వాగత వచనాలు పలికారు. రాజమండ్రి ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, కథా రచయిత, నటుడు, అవధానాలలో పాల్గొనే అభిరుచి ఉన్న వ్యక్తి అనేక ప్రక్రియలు,5,6 సంగీత వాద్యాలలో నిష్ణాతులు అయిన కొనకళ్ళ ఫణీంద్రరావు మాట్లాడుతూ ఈ కళాశాల లో చదివి న డా.తాతా సత్య సందీప్ అద్భుతంగా అవధానాలు చేస్తున్నారని, ఈ రోజులలో పిల్లలకు భాషలో పట్టు ఉండడం లేదనీ,కళ్ళు కు బదులు "కల్లు "అని,"వాళ్ళు"కు బదులుగా వాల్లు అంటున్నారనీ "ళ"కారం పలక లేక పోతున్నారనీ, తల్లిదండ్రులు రామాయణ,మహాభారత కథలు చెప్పటం లేదనీ,ఇక అమ్మమ్మ , నాన్నమ్మ, తాతయ్యలు దగ్గర పెరగడం లేదని చెప్పారు. చాలా మంది తల్లులు"జో అచ్యుతానంద జో జో ముకుందా..."వంటి పాటలు పాడి పెంచడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేడు చలనచిత్రాలు, చరవాణి వలన యువత పాడయ్యి పోయారని తన బాధను వ్యక్తం చేశారు. బహుముఖ ప్రజ్ఞతో వేల పాటలు పాడిన వీరు చక్కని వాక్చాతుర్యం తో అలరించారు. డైరెక్టర్ ఎస్.పి. గంగిరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ సినీగాయకుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ క్రమశిక్షణ లేని వారిని ఇక్కడ ఉండనవసరం లేదని తాను ఒక్కడే పాడుకుంటా ననే విషయాన్ని గుర్తు చేస్తూ , గొప్పవాళ్ళు క్రమశిక్షణకు యెంత ప్రాధాన్యత నిస్తారో గుర్తు చేశారు. త న హిందీ ఉపన్యాసాకుడైనప్పటికినీ,తెలుగులో ఆంగ్లపదం దొరల కుండా మాట్లాడ గలనని ,తనను ఉత్తమ శ్రోత గా మెచ్చేవారనీ తెలియజేశారు. నువ్వే కళాశాల విద్యార్థులు, శాస్త్రీయ నృత్యాలు, తెలుగు భాష కు చెందిన పాటల నృత్యాలు, ఉపన్యాసాలతో అలరించారు. డైరెక్టర్, ప్రిన్సిపాల్స్ ఇంత తక్కువ సమయంలో అద్భుతం గా వేదిక నలంకరించి తీర్చి దిద్దిన ఎన్.ఎస్.ఎస్ . వాలంటీర్లను, కళాకారులను తమ అభినందనలతో ముంచెత్తారు. భరత వేదముగా..అనే పౌర్ణమి చలన చిత్ర పాటను అభినందించిన విద్యార్థిని నాట్య ప్రదర్శన అద్భుతంగా అభినయించిన విద్యార్థి చూపరులను ఆకర్షించింది. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ధన్ ధన ధన్ జానపద బృంద నృత్యం విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణి కుమార్, ఎస్. కె . ఎన్.రెహ్మాన్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపన్యాసకులు , ఎల్.వేంకటేశ్వరరావు,ఆర్. తాతారావు పాల్గొనగా , హిందీ ఉపన్యాసకురాలు నృత్య రూపకల్పన చేశారు. తదుపరి విజయదుర్గ, ఎస్. కె .ఆర్. మొదలైన జూనియర్ డిగ్రీ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు వక్తృత్వ, దేశభక్తి, తెలుగుభాష పై , భారత రామాయణ గాథల పై పెట్టిన క్విజ్, ఏకపాత్రాభినయం, పద్య పఠనం వంటి పోటీలలో గెలుపొందిన వారికి డైరెక్టర్ ఎస్పి.గంగిరెడ్డి , ప్రిన్సిపాల్ రెహ్మాన్, ముఖ్య అతిథి కె.ఫణీంద్ర రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు . ఈ కార్య క్రమానికి ఎల్. వేంకటేశ్వర రావు వందన సమర్పణ చేయగా ,జనగణమన తో కార్యక్రమం ముగిసింది.

## డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.కే.వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ బి సుబ్బలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణ ఆవశ్యకత అందరి పై ఉందన్నారు. తాను ఇదే కళాశాలలో చదువుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఉద్యోగాన్ని సాధించానని తెలిపారు. యువత లక్ష్యం పై గురి వుంచి ముందుకు సాగాలని కోరారు. కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మధు కుమార్ మాట్లాడుతూ తెలుగు మాటకు వన్నెతెచ్చిన గిడుగు రామ్మూర్తి పంతులు ఆటకు వన్నెతెచ్చిన మేజర్ ధ్యాన్ చంద్, పాటకు వన్నె తెచ్చిన మైకేల్ జాక్సన్, ఈ ముగ్గురు మహానుభావులు జన్మించిన రోజని పేర్కొన్నారు. మాట ఆట పాటల మేలు కలయికని అన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నున్న వీరాంజనేయులు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని నేషనల్ స్పోర్ట్స్ డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు అతిథుల చే బహుమతి ప్రధానం చేశారు. అనంతరం ముఖ్య వక్త డాక్టర్ బి సుబ్బలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ ఆనంద్ అకాడమిక్ కోఆర్డినేటర్ కె.శంకర్ నారాయణ, డాక్టర్ కె ఎస్ ఆర్, రాము, చంటి, దిలీప్ వీర్రాజు తదితర ఆధ్యాపకులు ఇతర సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజమండ్రికి ఉమెన్ క్రికెట్ అకాడమీ వస్తుంది

**ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది : జాతీయ స్పోర్ట్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలో ఉమెన్ క్రికెట్ అకాడమీ ఏర్పాటు కానుందని, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్‌కెవిటి కళాశాల ఆవరణలో జరిగిన జాతీయ స్పోర్ట్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి భారత హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో మన దేశానికి మూడు బంగారు పతకాలు అందించిన గొప్ప క్రీడాకారుడు ఆయన అని గుర్తు చేశారు. హాకీ క్రీడ ద్వారా ఇండియా పేరుప్రతిష్టల్ని అంతర్జాతీయంగా చాటిచెప్పారని కొనియాడారు. 1928, 1932, 1936 ధ్యాన్ చంద్ సారథ్యంలో ఇండియా హాకీ జట్టు ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్స్ దక్కించుకుందన్నారు. హాకీ క్రీడతో పాటు ఆర్మీ అధికారిగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం పలు అవార్డులతో సత్కరించిందన్నారు. ప్రజల రోజువారీ జీవితంలో ఆటలను భాగం చేయాలనే ఉద్దేశంతోనే స్పోర్ట్స్ డే రోజున ప్రభుత్వాలు క్రీడలకు సంబంధించిన పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయన్నారు. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు చాలా ముఖ్యమన్నారు. క్రీడాకారులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని... అయితే అటు తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఆడుదాం ఆంధ్రా పేరుతో దోచుకుందన్నారు. అసలు ఆడుదాం ఆంధ్ర ఎందుకు పెట్టారో ఇప్పటికీ ఎవరికి అర్థం కాని ప్రశ్నగానే మిగిలిందన్నారు. ఎన్నికల హామీగా తాము ఇచ్చిన హామీ రాజమండ్రిని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తాన్నారు. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించి తీరుతామన్నారు.

## నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలపై తనిఖీలు

**శ్రీ లహరి ప్యాన్సీ-జనరల్ షాపుపై విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ శాఖ,లీగల్ మెట్రోలజీ అధికారులు-కమర్షియల్ టాక్స్, పోలీసు అధికారులతో కలిపి సంయుక్తముగా తనిఖీలు**



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలకు సంబంధించి విశ్వస నీయ సమాచారం మేరకు డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలము మరియు గ్రామము లోని శ్రీ లహరి ప్యాన్సీ-జనరల్ షాపుపై విజిలెన్స్ ఎ న్ ఎ ో ర్ ్స ఎ ె ం ట్ అధికారులు,రెవెన్యూ శాఖ, లీగల్ మెట్రోలజీ అధికారులు, కమర్షియల్ టాక్స్ మరియు పోలీసు అధికారులతో కలిపి సంయుక్తముగా తనిఖీలు నిర్వహించటమైనది సదరు షాపు నందు ఆరు బ్రాండ్లకు చెందిన బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్లు సుమారు రూ. 1,71,000/- విలువైన 3,420 ప్యాకెట్స్ సిగరెట్లును స్వాదినపర్చుకొని,నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలు చేయుటచే షాపు యజమాని మరియు సంబంధిత వ్యక్తుల పై సెక్షన్ 20(2) ఆఫ్ సి ఓ టీ పి ఏ యాక్ట్ 2003 క్రింద మరియు బి ఎన్ యస్ యాక్ట్ 272,275 ఆర్ డబ్లు 3(5) సెక్షన్స్ క్రింద క్రిమినల్ కేసు నమోదు కొరకు కొత్తపేట పోలీసుస్టేషన్‌కు అప్పగించటమైనది. కోనసీమ జిల్లా కొత్తపేట కు చెందిన గ్రంథి నాగ వెంకట సూర్యనారాయణ మూర్తి అమలాపురంకు చెందిన తాళ్లరేవు రాజు అనే వ్యక్తి నుంచి సిగరెట్లను సేకరించి, తన షాపు వ్యాపార ప్రాంగణంలో ఉంచి రిటైల్‌గా స్థానిక వ్యాపారులకు విక్ర యిస్తున్నాడు. సదరు షాపు నందు గల సిగరెట్ ప్యాకెట్ల పై చట్టబద్ధమైన వివరాలను ప్రకటించ నందుకు లీగల్ మెట్రాలజీ అధికారులు 18/36(1) ఎల్ ఏం యాక్ట్-2009 ఆర్ డబ్ల్యూ రూల్ 24 ఎల్ ఎం,(పి సి,,)రూల్ 2011 క్రింద రెండు కేసులు నమోదు చేసియున్నారు. ఈ సందర్భముగా రీజనల్ విజిలెన్స్-ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె. ఎస్. ఎస్. వి సుబ్బారెడ్డి,ఐ పి యస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్-ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలోని నిషేధిత సిగరెట్లను నిల్వ చేసిన, అమ్మకము చేసిన సదరు దుకాణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపియున్నారు. ఈ తనిఖిలలో విజిలెన్స్ అధికారులు ఎస్ ఐ టి . జగన్నాథరెడ్డి,కానిస్టేబుల్స్ వలీ,వీరబాబు మరియు కిషోర్, తూనికలు కొలతలు శాఖ అధికారి కుటుంబరావు మరియు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అంబేద్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ కుమార్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంబేద్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం అంబేద్కర్ నగర్, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలో భాగంగా మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం ఇతర వ్యాధులు వచ్చిన వెంటనే డాక్టర్లు సంప్రదించి వైద్య సేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ .వి. ఎం. వి. ఎస్. ఎస్. కుమారి, ఏ.ఎన్.ఎంలు యు ఎల్ వి రమణ, దుర్గ, ఆశా వర్కర్లు ఆదిలక్ష్మి ,లీల, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

## మీరు సర్పంచ్ గా పనిచేసారు గౌరవంతో డిమాండ్ నోటీసు ఇవ్వలేదు

**సర్పంచ్ మంగయ్యమ్మ**



**అల్లవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన కొల్లు సత్యవతి గతంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ గా పని చేసారు. ఆ గౌరవం తోనే ఇంటి పన్ను కట్టవలసి ఉండగా డిమాండ్ నోటీసు ఇవ్వలేదని, మీరు రెండు సంవత్సరాలు నుండి మీ భర్త విష్ణు మూర్తి పేరున పన్ను బకాయి రెండు సంవత్సరాలు నుండి కట్టకుండా ఉంది. అలాగే మరిడమ్మ సెంటర్ నందు రెండు అంతస్తులు కాంప్లెక్స్ భవనం ఉంది. డాక్యూమెంట్, ఆధార్ కార్డు వివరాలు గ్రామ పంచాయతీలో అందజేయాలనీ పన్ను వేయడం జరుగుతుందని గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లాడి మంగయ్యమ్మ తెలిపారు. మీ మీద మాకు ఎటువంటి వ్యక్తి గత కక్ష లేదని మాతో కలిసి పని చేస్తే మరింత గ్రామ అభివృద్ధి చేయొచ్చని సర్పంచ్ అన్నారు. మేము కులం మతం రాజకీయాలు చూడకుండా గ్రామ పంచాయతీ ఫరిధిలో అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ మల్లాడి మంగయ్యమ్మ తెలియజేసారు.

### రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా
# తెలుగు భాష దినోత్సవ వేడుకలు



**రాజానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం సంపత్ నగరం గ్రామం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ నందు తెలుగు భాషా దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల యజమాన్యం చైర్మన్ డా. టి. కె. విశ్వేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ టి.స్వరూప్ రెడ్డి మరియు పాఠశాల ప్రిన్సిపల్ టి.వి.డి. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆధునిక భాష పోకడలకు అలవాటు పడిన విద్యార్థులకు మన మాతృభాష అయిన తెలుగు వైశిష్ట్యాన్ని తెలియజేయు ఉద్దేశంతో, గిడుగు వెంకట రామమూర్తి జన్మదిన పురస్కరించుకుంటూ పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు మర్చిపోతున్న తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని తెలియజేసే భువన విజయం, పరమానందయ్య శిష్యులు వంటి స్కిట్స్ ఆనాటి సాంఘిక దురాచారాలను అరికట్టిన కందుకూరి, గిడుగు, గురజాడ వంటి పాత్రల ద్వారా ,కవులు మరియు రచయితలు తెలుగు భాష కోసం కృషి చేసిన మహానుభావులు వంటి వివిధ వేషధారణలతో అలరించిన చిన్నారులను పాఠశాల యాజమాన్యం బహుమతులతో ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

# బిజెపిలోకి 76 కుటుంబాలు చేరిక



**చింతూరు డివిజన్, విశ్వంవాయిస్ న్యూస్ :** చింతూరు మండలం లోని పెద్ద శీతనపల్లి గ్రామము నుండి 76 కుటుంబాలు వారు వైసిపి పార్టీ నుండి మూట నారాయణ, శ్యామల జోగారావు, మడివి కన్నయ్యా, శ్యామల రామయ్య, మిడియం.సీతయ్య, మడివి భీమయ్య, మడివి . సుబ్బయ్య, మూట నారాయణ, శ్యామల జానకి, సోడే లక్ష్మయ్య తదితరుల నాయకత్వంలో బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య, చింతూరు మండల అధ్యకులు డీవీఎస్ఎన్. రమణ రెడ్డి,కట్టం ముత్తయ్య అద్వర్యంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా పెద్ద శీతన పల్లి గ్రామములో జరిగిన సమావేశంలో బిజెపి నాయకులు పాయం వెంకయ్య ప్రసంగిస్తు ఈ దేశంలో అన్ని వర్గాలు, రైతులు, మహిళలు కార్మికులు అన్నిరకాల ప్రజలను దేశాన్ని 10 సం. బిజెపి పాలిస్తుందిదన్నారు. బిజెపిలో చేరిన వారినందరిని అభినందించారు. చింతూరు మండలంలో జామాయిల్ మాఫియా, కాంట్రాక్టర్ల మాఫియా రాజ్యమేలు తొందని. అనంతబాబు నుండి ప్రజలు విముక్తి పొందారని, వైసిపిలో ఉన్నపుడు నిధులేమీ ఇవ్వలేదని తెలిపారు చింతూరు మండలం అభివృద్ధికి, బిజెపి కృషి చేస్తుందని. తెలిపారు .రాబోయె స్థానిక సంస్థల ఎన్నికలలో పదవులు పోతాయని భయంతో వైసిపి అపవిత్ర పొత్తుల కోసం ప్రజల్ని మరొక్క సారి మోసం చేసేందుకు, ప్రజలు వైసీపీ పార్టీకి భయపడవద్దని పేర్కొన్నారు.


### మెట్రో కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ప్రతిష్టాత్మక
# గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నేషనల్ అవార్డు



**పి గన్నవరం విశ్వంవాయిస్ న్యూస్ :** పి. గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన నందెపు వెంకటేశ్వర రావు హైదరాబాదులో మెట్రో కెమ్. ఫార్మసికల్ కంపెనీ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించారు అలాగే తన సొంత గ్రామంలో పోతవరంలో ఎన్నో సేవా కార్య క్రమాలు చేస్తూ వివిధ గ్రామాలలో ఆల యాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారు. ఈ తరుణంలో మెట్రో కెమ్ ఏపి.ఏ ఫార్మాక్సెల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి ప్రతిష్టాత్మక బెస్ట్ అవుట్ స్టాండింగ్ ఎక్స్పోర్ట్స్ అవార్డుని కేంద్ర వాణిజ్య శాఖ మరియు పరిశ్రమల శాఖ మంత్రి జితిన్ ప్రసాద్ చేతుల మీదుగా పి గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన మెట్రో కెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) న్యూఢిల్లీలో అవార్డును అందుకున్నారు ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ అవార్డు మెట్రో కెమ్ కంపెనీ యొక్క విజయంలో మరొక కీలక రాయి అవుతుంద న్నారు. ఈ సందర్భంగా పోతవరం గ్రామానికి చెందిన తెల్లగా రెడ్డి విజయకృష్ణ. చిల్లరఏడుకొండలు. బండారు వెంకటేశ్వరరావు కలిగినీడి చంద్రశేఖర్ నందెపు శ్రీనివాసరావు. వెంకటేశ్వరరావుని అభినందించారు.

### చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా
# తెలుగు భాషా దినోత్సవం





**చింతూరు డివిజన్, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. కె. రత్న మాణిక్యం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొలుత గిడుగు రామ్మూర్తి పంతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి తెలుగు శాఖధిపతి కె. శ్రీదేవి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు గారి జయంతి నే ఎందుకు తెలుగు భాషా దినోత్సవం గా జరుపుకుంటారో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగు భాష పట్ల పాశ్చాత్యులు ఎనలేని సేవ చేశారని, మన జాతీయ స్థాయిలో కూడా తెలుగునకు ప్రాధాన్యం ఇస్తున్నారని, కావున అమృతం వంటి అమ్మ భాషను మరవకూడదని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లిశేఖర్ మాట్లాడుతూ మనసుకు హత్తుకొనే భావం మన తెలుగు భాషలో ఉందని, పరభాష వ్యామోహంతో తల్లి భాషను మరవ వద్దని తెలియజేశారు. ఈ సందర్భంగా కవి నూనె రమేష్ మాట్లాడుతూ “తెలుగు అంటే”అనే కవితను చదివి, అమ్మ భాషను మరిచిపోతే జరిగే పరిణామాలను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థినీ,విద్యార్థులకు వ్యాసరచన , పద్య పఠనం పోటీలు నిర్వహించి, ఆ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.వై. పద్మ, ఆర్.సిహెచ్. నాగేశ్వరరావు, కె. శకుంతల, కె. శైలజ, ఎస్. అప్పనమ్మ, కె. శ్రీలక్ష్మి, సి.హెచ్. రాజాబాబు, ఆర్. మౌనిక, జి. సాయికుమార్, తదితర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### కూనవరంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించిన
# బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం, కూనవరం గ్రామంలో మాధ వరపు సూరిబాబు తండ్రి కీ..శే..మాధవారపు రామా రావు (రాము) చిన్నరోజు కార్యక్రమములో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని వారి కుటుంబం సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎన్డిఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా తెలుగు భాష
# దినోత్సవం



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాష దినోత్సవం , జాతీయ క్రీడా దినోత్సవాలను ఉపాధ్యాయులు, విద్యార్దులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబెట్, క్రీడపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బాలకృష్ణ, రమేష్,సుబ్బయ్య, నాగరాజు, పెంటమ్మ, సుజాత, భద్రయ్య,రాజు, రత్తయ్య, ప్రసాద్, శ్రీనివాస్, జయ, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 31నే నూరు శాతం పింఛన్లు
# పంపిణీ చేయాలి
### ఎంపిడిఓ కృష్ణ మోహన్




**అల్లవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సెప్టెంబర్ నెల పింఛన్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 31 ఉదయం నుండి గ్రామాల్లో పంపిణీ చేయాలని ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ ను ఆదేశించారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో పింఛన్లు పంపిణీ పై జారీ చేసిన సూచనలు చేసారు. 30 వ తేదీన పింఛన్లు సొమ్ము బ్యాంక్ నుండి డ్రా చేసి బట్వాడా సిబ్బందికి అందజేయాలి, బట్వాడా సిబ్బంది 31 వ తేదీ ఉదయం 5.30 నిముషాలకు లాగిన్ అయ్యి పింఛను పంపిణీ ప్రారంభించాలి. మొదటి రోజే 100 శాతం పంపిణీ కి కృషి చేయాలి. దూర ప్రాంతంలో ఉన్నవారికి 31 వ తేదీ ఉదయం గ్రామంలో అందుబాటులో ఉండాలని సమాచారం ఇవ్వాలి. ఈ సూచనలు విధిగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, ఏ ఓ లక్ష్మణ రావు, ఈఓఆర్డీ ఎన్ వి సత్యనారాయణ కార్యదర్శులు రాజమోహన్ శ్రీనివాస్ సత్యనారయణ మృదుల రవి రాజు శిరీష పాల్గొన్నారు.

### కాసులకు కక్కుర్తి పడ్డ అధికారులు
# త్రాగునీరు కోసం ప్రజలు ఇక్కట్లు



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్** రామచంద్రపురం నియోజకవర్గం కే గంగవరం మండలం కోటిపల్లి కొత్తకోట గ్రామంలో పంట పొలాలను రొయ్యల చెరువులుగా మార్చడం ద్వారా భూగర్భ జలాలు పూర్తిగా త్రాగునీరుకి ఉపయోగపడకుండా పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఎన్నిసార్లు అధికారులకు తమ గోడు వినిపించుకున్న తమకు ఏదీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తూ తగిన చర్యలు తీసుకోకపోవడంతో గ్రామ ప్రజలు త్రాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇక గ్రామ ప్రజలందరూ ఒక నిర్ణయం తీసుకుని గత 24 గంటలుగా గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు రామచంద్రపురం వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ ఆందోళనకారులకు అండగా ఉండి న్యాయం జరిగేంత వరకు తమ వెన్నంటే ఉంటానని హామీ ఇచ్చారు ఈ సంఘటనపై సంబంధిత తాసిల్దార్ సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను సమీక్షించి అధికారులకు నివేదిక ఇస్తానని తెలియజేశారు ఇప్పటికైనా అధికారులు స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి తమకు న్యాయం చేయాలని తెలియజేశారు.

### జనసేన పార్టీలో
# తిక్కిరెడ్డి శ్రీను జాయిన్





**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఎంట్రుకోన గ్రామ పంచాయతీ సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ బుధవారం జనసేన పార్టీ లో జిల్లా పార్టీ నాయకులు సమక్షంలో జాయిన్ అయ్యారు.ఇప్పటి వరకు వైస్సార్సీపీ పార్టీలో సర్పంచ్ గా గెలిపోంది గ్రామ అభివృద్ధి చేసారు. ఆ పార్టీ కి రాజీనామా చేసి ఎన్డిఏ పార్టీలో ప్రజలు కోరిక మేరకు జాయిన్ అయ్యా నని మరింత అభివృద్ధి కి కృషి చేస్తానని సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీను అన్నారు. పార్టీ కండువా కప్పి గ్రామ కమిటీ, జిల్లా నాయకులు మండల నాయకులు పార్టీలో సాధారం గా జాయిన్ చేసు కున్నారు. పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారా యణ ప్రత్యేకంగా అభినందించారు. సర్పంచ్తో పాటు గ్రామంలో కార్యకర్తలు జనసేన పార్టీ లో జాయిన్ అయ్యారు. జనసేన గ్రామ కమిటీ ప్రెసిడెంట్ వర్రే సూరిబాబు, నల్లా శ్రీధర్,యాల్ల సతీష్, లింగోలు పండు, ఆకుల బుజ్జి, చిక్కం సుధా, చిక్కం సతీష్, మంగ తాయారు, పోలిశెట్టి బాబులు, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

### కళాశాల భవనం ప్రారంభ ఖర్చుకు
# చేతులెత్తేసిన కాంట్రాక్టర్ !

**ప్రిన్సిపాల్ జేబుకి రూ. 25,000 చిల్లు.. బడి మార్గం శుభ్రతకు పర్వత సురేష్‌కు చిల్లు**



**శంఖవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** నేను భవనం నిర్మాణం వాస్తవ నిర్మాణ గుత్తేదారును కాదు. మధ్యలో ఆపేయగా మిగిలిన పని చేయడానికి టెండర్లు పిలవలేదు. నేను కాంట్రాక్టు పొందలేదు. నేను కేవలం ఓ తాపీ పనివాడిని మాత్రమే. విజయవాడ కాంట్రాక్టర్ భవన నిర్మాణం పనులను మధ్యలో ఆపేసి పోయాడు. నన్ను ప్రభుత్వ శాఖా అధికారులు బ్రతిమాలితేనే మిగతా పనులను చేసాను. నాకు రూ. 21,000,00 పనులనే అప్పగించారు. నేను భవనం నిర్మాణం అనంతరం ప్రారంభోత్సవం వ్యయాన్ని నేను భరించలేను. భరించను. అంటూ ఆ కాంట్రాక్టరు నిర్మోహమాటంగా చేతులు ఎత్తేసాడు. అతను ఎవరో కాదు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ కళాశాల నూతన భవనం శేష అభివృద్ధి పనులను పూర్తి చేసిన కాంట్రాక్టరు సత్యనారాయణ. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్వ శిక్షా అభియాన్ పథకంలో రూ. 1,03,000,00 నిధులతో గ్రౌండ్, మొదటి అంతస్థులో 8 గదులు, 8 స్నానపు గదులు, మరో 8 మరుగుదొడ్లు, వరండా సౌకర్యాలతో 80 శాతం భవనాన్ని విజయవాడ కాంట్రాక్టర్ నిర్మించారు. ఐతే మిగిలిన 20 శాతం పనులను రూ. 21,000,00లతో రెండో గుత్తేదారు సత్య నారాయణ పూర్తి చేసాడు. ఈ భవనాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం ప్రారంభించారు. అయితే ఈ ప్రారంభ ఖర్చులకు మాత్రం సత్యనారాయణ ముఖం చాటేసాడు. దీంతో ఎలాగూ ప్రారంభాన్ని ఆపకూడదు గనుక అందరూ కలిపి ప్రారంభం ఆర్భాటాలకు అయ్యే ఖర్చుల భారాన్ని కండగుత్తగా ప్రిన్సిపాల్ బీరా బాలామణి కుమారి ఒక్కరి మీదే రుద్దారు. దీంతో ఆమె స్వయంగా తన జీతం రాళ్ళ నుంచి సుమారు రూ. 25,000 వరకూ వ్యయం చేసి చేతులు కాల్చు కున్నారు. కార్యక్రమం ఖర్చు ఏ రూపేణా ఆమెకు తిరిగొచ్చే అవకాశం లేదు. ఇంతకీ కాంట్రాక్టరు కాని కాంట్రాక్టరు సత్యనారాయణ మాత్రం కేవలం ప్రారంభోత్సవ రాతి శిలాఫలకానికీ, దాన్ని కప్పి ఉంచే గుడ్డకు మాత్రమే ఖర్చుపెట్టారు. వాటినే సమకూర్చారు. నూతన భవనం దగ్గరకు వెళ్లే దారిలోని కూడా అతను బాగు చేయించ లేదు. ఆ మార్గాన్ని బుధవారం సాయంత్రం పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు పర్వత సురేష్ తన సొంత ఖర్చులతో ప్రొక్లెయినరును ఏర్పాటు చేయించి అప్పటి కప్పుడు శుభ్రం చేయించారు. గ్రామాభివృద్ధి పట్ల తన అభిరుచికి సురేష్ నిదర్శనంగా నిలిచారు. కాంట్రాక్టరు చేతికి మట్టి అంటకుండా చూసుకున్నారు. పైగా కార్యక్రమాన్ని తానే ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి విజయవంతంగా జరిపించాడు అనే కీర్తిని మాత్రం కాంట్రాక్టర్ సత్యనారాయణ అప్పనంగా కొట్టేసాడు.

# దోపిడీ సామ్రాజ్యాన్ని జగన్ సృష్టించాడు

***స్కిల్ డెవలప్మెంట్ తో నిరోధ్యోగ యువతకు పెద్ద పీట***

***తవ్వే కొద్ది రాష్ట్రంలో అవినీతి కుప్పలు కుప్పలు బయట పడుతున్నాయి***

***వైయస్ఆర్ సీపీ సీనియర్లు సైతం కూటమి వైపు***

***నిబద్ధతతో పని చేసే కార్యకర్తలకు న్యాయం.. మీడియా సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల***



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** దోపిడీ సామ్రాజ్యాన్ని జగన్ సృష్టించాడు..,వైకాపా అరాచకాలపై తప్పక చర్యలు అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అయన కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ సీపీ అరాచక విదానాలు నుండి విముక్తి పొంది ఎన్డీయే పని చేస్తుంది,తవ్వే కొద్ది రాష్ట్రంలో అవినీతి కుప్పలు కుప్పలుగా బయటపడుతుంది. తప్పుడు విదానాలు వల్ల రాష్ట్రం విచ్ఛిన్నం అయింది.ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల అండతో జగన్ అరాచకాలు సృష్టించారు.జగన్ లాంటి నేత ప్రజాక్షేత్రంలో ఉండటం అర్హులా..వైయస్ఆర్ సీపీ సీనియర్లు సైతం కూటమి వైపు చూస్తున్నారు. ఒకొక్క రంగాన్ని ప్రక్షాళన చేసుకుంటూ వస్తున్నాము,పోలవరం అంశం పై డిల్లీలో మోదీ నీ చంద్ర బాబు పలుసార్లు కలిశారు.బాబాయ్ హత్య, సొంత కేసులు మాఫీ కోసం జగన్ డిల్లిలో పర్యటనలు చేసారు. చిత్తశుద్ధి ఉన్న నాయకుడు ఉంటే అభివృద్ధి చేసి చూపిస్తారు అనడానికి చంద్రబాబు ఉదాహరణ,చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల కోసం డిల్లి లో పలు దఫాలు పర్యటిస్తున్నారు. పారిశ్రామిక పటంలో ఏపీ ఉంటుంది. వరద వలన ఇసుక తవ్వడం ఇబ్బందిగా ఉంది.బోట్స్ మెన్ సొసైటీ ద్వారా ఇసుక తియ్యడానికి ప్రయత్నాలు చెయ్యాలి అని చెప్పాను.స్కిల్ డెవలప్మెంట్ తో నిరోధ్యోగ యువతకు పెద్ద పీట వేస్తాము.రాష్ట్రంలో ట్రాన్స్ఫర్ ప్రక్రియ మొదలయ్యాయి, స్థానిక సంస్థలను చైతన్యం చెయ్యాల్సిన అవసరం ఉంది.నిబద్ధతతో పని చేసే కార్యకర్తలకు న్యాయం చెయ్యడంలో తప్పు లేదు,సభ్యత్వ నమోదు, కార్యకర్తలకు ఏమి చెయ్యాలో మంత్రి లోకేష్ తో ఒక కమిటీ వేసి నిర్ణయిస్తాము,ఇంకా గ్లోబస్ ప్రచారాలతో బ్రతకాలని జగన్ కోరుకుంటున్నారు.జల్ మిషన్ ఎందుకు జగన్ రద్దు చేసాడు. పోలవరం నిధులు అన్ని ఏమైపోయాయి.జగన్ చేతకానితనం వల్లే డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది.ముఖ్య నేతలు అందరూ వైయస్ఆర్ సీపీ విడటానికి సిద్ధంగా ఉన్నారు.హర్ష కుమార్ మాటలు పట్టించుకోవడం అనవసరం. సూపర్ 6 హామీలకి కట్టుబడి ఉన్నాము.ఒక్కొక పథకం అమలు చేస్తుంటూ వస్తాము టిడ్కో, వాంబే గృహాలలో లబ్దిదారులు ఉండకుండా అద్దెకు ఇస్తున్నారు.ఆరు నెలల్లో రిఆర్గనైజ్ చేసి సౌకర్యాలు కల్పిస్తాం. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వాళ్లకు మాట్లాడే అర్హత లేదు.ఉచిత బస్ ప్రయాణం త్వరలో ప్రారంభిస్తాం. జగన్ లక్ష కోట్లు దోచుకుపోయారు. అమ్మాయిని బలవంతంగా ఎత్తుకొచ్చ విజయవాడ తీసుకురావడం జగన్ బుద్దిలేనితనం,అనంత బాబు చేసే పనులు చేసి మార్ఫింగ్ అంటున్నాడు. వైయస్ఆర్ సీపీ నాయకులు ఒళ్లు బలిసి కొట్టుకుంటున్నారు.ఇసుక, మద్యం మాఫియా పై విచారణ తప్పదు,వైయస్ఆర్ సీపీ అన్ని అరాచకాలు పై తప్పక చర్యలు ఉంటాయి.జగన్ పేరు త్వరలో ప్రజలు మర్చిపోతారు.దోపిడీ సామ్రాజ్యాన్ని జగన్ సృష్టించాడు.మద్యం అన్ని బ్రాండ్లు వస్తాయి, ధరలు తగ్గిస్తాము న్యాయమైన మద్యం ప్రజలకు అందిస్తాము అని ఆయన అన్నారు.

### రఘుదేవపురం పిహెచ్సిలో ఆరోగ్యంపై
## అవగాహన కార్యక్రమం



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం పిహెచ్సిలో ప్రభుత్వ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం జరిగింది. డెంగ్యూ మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆరుబయట నీరు నిలవకుండా జాగ్రత్త వహించాలని అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించి సరైన మందులు వాడాలని వైద్యాధి కారి తెలియజేశారు. వచ్చిన రోగులను పరీక్షించి వారికి ఉచితంగా తగిన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎన్ రాజు, ఎం ఎల్ హెచ్ పి స్పందన, ఏఎన్ఎం రమణ, ఆశాలు రవళి, సావిత్రి, వీరమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఒక్కరోజు ముందుగానే
## ఫెన్షన్ పంపిణి



రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్: పెన్షన్ పంపిణి కార్యక్రమం సెప్టెంబర్ నెల ఒకటో తారీకు బదులుగా,ఆగస్టు 31 వ తారీకునే పంపిణీ చేయుటకు ప్రభుత్వం నిర్ణయించింది రాయవరం ఎం పి డివో కే నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 10,196 పెన్షన్లకు గాను నాలుగు కోట్ల 19లక్షల 85వేల500 విడుదల కాబడినవి అని తెలియజేసారు. ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయడానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వివిధ పెన్షన్పంపిణి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో లబ్ధిదారులు అందరికీ తెలిసేలాగున గ్రామాల్లో దండోరా వేసి ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా అందుబాటులో లేని వారికీ ఫోన్ చేసి లేదా వారి బంధువులతో కబురు పంపి ఈనెల31వ తేదీన గ్రామాల్లో అందుబాటులో ఉండేటట్లు చేయవలసిందిగా కార్యదర్శిలను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి 31వ తేదీన 98% పంపిణీ జరిగేటట్లు చూడవలసిందిగాను, అదేవిధంగా గ్రామంలో ఉన్నటువంటి ప్రజాప్రతినిధులను పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేటట్టుగా చూసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో నరేంద్ర రెడ్డి ఆదేశించారు.



### టీడీపీ దోపిడీ రాజ్యం దొంగల రాజ్యం అంటున్న
## వైసీపీ ఇంచార్జ్ సూర్యప్రకాష్



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం వెల్లసావరంలో జగనన్న లేహౌట్లో ఇసుక దోపిడీ. లేహౌట్లో సుమారు 2000 వేల టన్నులు పైబడి ఇసకను అధికార పార్టీకి చెందిన ముఖ్య అనుచరులు రాత్రికి రాత్రే దొంగిలించ రాంటూ రామచంద్రపురం నియోజవర్గ వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ ఆరోపించారు.వెల్ల లేహౌట్ లో వున్న ఇసుకను పరిశీ లించిన అయన దోపిడీ రాజ్యం దొంగల ప్రభుత్వం అంటూ నినా దలతో ఒరేతించారు. ఈసందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ నీరు పేదలకు ఇల్లు కట్టుకునేందుకు నిల్వ ఉంచిన ఇసకను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ అనుచరులు ఇసకను ఎత్తుకొని పోవడంతో పాటు ఏమి తెలియనట్టు వ్యవరించడం విడ్డురంగా ఉందంటూ హౌసింగ్ ఏఈ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన పిర్యాదు పేరు లో వున్నా కొంతమంది పేర్లను మాత్రమే చేర్చారని ఈ ఇసుక దోపిడీలో వున్న ముఖ్యమైన అనుచరుడు పేరును ఎఫ్ఐఆర్ లో చేర్చాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని,అలానే జిల్లా ఎస్పీ కి పిర్యాదు చేస్తామని అన్నారు.

# సౌమ్యురాలినే, కానీ చాలా స్ట్రిక్టుగా ఉంటాను

## కస్తూర్బా కళాశాలను భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే : కార్యక్రమాన్ని సమన్వయం చేసిన పర్వత సురేష్







**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేను చాలా మృదుస్వభావినని, సౌమ్యురాలినని అందరూ అంటుంటారని, దాంతోబాటు అంతకు మించి ప్రభుత్వ విధానాలను అమలు చేయించడంలో మాత్రం చాలా కఠినంగా(స్ట్రిక్టు)గా ఉంటానని తన గురించి తాను ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విస్పష్టంగా చెప్పారు. తన మృదు స్వభావాన్ని ఎవరైనా అలుసుగా తీసుకుని, ఏ తప్పిదాన్నైనా ఎమ్మెల్యే చూసీ చూడనట్టు వదిలేస్తారని, క్షమించేస్తారని భావించి తప్పులు మీద తప్పులను చేసే అవకాశాలను ముందుగా నివారించేందుకు తన చిరు నవ్వుతోనే గట్టిగా పరోక్ష హెచ్చరికను ఎమ్మెల్యే సత్యప్రభ జారీ చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కెజిబివి), జూనియర్ కళాశాల, వసతి గృహాల సముదాయం ఆవరణలో నూతనంగా నిర్మించిన కళాశాల భవనాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్వ శిక్షా అభియాన్ పథకంలో రూ. 1,03,000,00 నిధులతో గ్రౌండ్, మొదటి అంతస్థుల భవనంలో 8 గదులు, 8 స్నానపు గదులు, మరో 8 మరుగు దొడ్లు, వరండా సౌకర్యాలతో నిర్మించారు. సాయంత్రం 3.30 గంటలకు జ్యోతీ ప్రజ్వలనం చేసి, శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. తరగతి గదులను ఆమె ముఖ్య అతిథిగా ప్రారంభించారు. భవనం ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం ఈ సందర్భంగా వర్షం కారణంగా ఓ తరగతి గదిలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే సత్యప్రభ ప్రసంగించారు. నియోజకవర్గంలోని కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలు... ఇలా ఏ విద్యాలయాల్లోనైనా సరే జరగకూడనివి ఏవి జరిగినా ఉపేక్షించనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మిమ్మల్ని (విద్యా సంస్థల యాజమాన్యాల్ని) నమ్మి, మీకు తమ పిల్లల్ని అప్పగించిన తల్లి,దండ్రుల నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయకుండా విద్యార్థులను పర్యవేక్షిస్తూ, వారికి కావలసిన అన్ని సదుపాయాలనూ సక్రమంగా కల్పిస్తూ, ఉత్తమంగా విద్య, వైద్యంను అందిస్తూ భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సూచించారు. మీకు నా ఏ అవసరం వచ్చినా ఒక ఎమ్మెల్యేగానే గాకుండా ఒక మహిళ గానానైనా నాకు చెప్తే సమస్యలు పరిష్కరానికి, విద్యార్థుల ఉన్నత స్థాయికి చేరుకునేలా అవసరమైన నా వంతు సహకారాన్ని ఖచ్చితంగా అందిస్తానని ఎమ్మెల్యే సత్యప్రభ హామీ ఇచ్చారు. శంఖవరంను దత్తత తీసుకోవాలని సోదరుడు పర్వత సురేష్ కోరారు... ఖచ్చితంగా శంఖవరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. కస్తూర్బా నూతన భవనానికి ప్రహరీ గోడ, రోడ్డు, విద్యార్థినిల క్రీడా ప్రాంగణానికి స్థలాన్ని కేటాయించడం, విద్యా సంస్థల్లో విద్యార్థినిలకు రక్షణ కల్పన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే సత్య ప్రభ హామీ ఇచ్చారు. ఒకప్పుడు లేని విద్యా సౌకర్యాలు, సౌలభ్యాలు, అవకాశాలు, పథకాలూ ఇప్పుడు ఉన్నాయని, ఆనాటి కాలంలోనే ఉన్నతంగా చదివి, ఉన్నత స్థాయికి ఎదిగారని, మరి ఇన్ని అవ కాశాలు అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో విద్యార్థులకు ఉత్తమ చదువు, ఉన్నత లక్ష్యం ఒక్కటే గురిగా ఉన్నత భవిష్యత్తు ఏర్పరచు కోడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విద్యార్థినిలకు పిలుపును ఇచ్చారు. స్వర్గీయ ఎమ్మెల్యే పర్వత సత్యనారాయణ, ప్రత్తిపాడు నియోజవర్గం ఇంఛార్జి స్వర్గీయ వరుపుల రాజా ఆశయ సాధన వారసురాలిగా, పర్వత సత్యనారాయణ మానస పుత్రికగా, తన ఆత్మీయ సోదరి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శంఖవరం గ్రామాన్ని దత్తత తీసుకోవాలని పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత మరో అతిథిగా మాట్లాడుతూ పర్వత సురేష్ కోరారు. శంఖవరం మీద ప్రాంతీయ మమకారం తోనైనా, తెలుగుదేశం పార్టీ మీద ఉన్న అభిమానంతోనైనా ఎటు వంటి భేషజాలకు పోకుండా స్వర్గీయ నేతల స్ఫూర్తితో ప్రజలు అందరి సహకారం, భాగస్వామ్యంతో అభివృద్ధిలో ముందడుగు వేద్దామని సురేష్ పిలుపును ఇచ్చారు. కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేయాలనీ, మండల ప్రజా పరిషత్తు, మండల రెవెన్యూ కార్యాలయాల భవనాలకు నిధులు, నిర్మాణానికి కృషి చేస్తే ఎమ్మెల్యే పేరు చరిత్ర పుటల్లో నిలచి పోతుందని సురేష్ గుర్తుచేశారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రౌతులపూడిలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉంటే శంఖవరంలో లేదని, ఉన్నత శ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి నుంచి కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయికి దిగజారి పోవడం మనసును కెలుకుతోందని, శంఖవరంలో కూడా సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు తన జీవిత కాల ఆశయమని, అందుకు పూర్వపు ప్రభుత్వ ఆసుపత్రి స్థలం అందుబాటులో ఉందని, ఇక్కడ సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే సత్యప్రభ కృషి చేయాలని పర్వత సురేష్ కోరారు. శంఖవరంలోని కస్తూర్బా గాంధీ, ఆదర్శ కళాశాల, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా, బాలికల రక్షణకు పోలీసుల రక్షణ ఏర్పాటు చేస్తామని హామీనిస్తూ, ఈ విషయమై ఎమ్మెల్యే ఆ శాఖ అధికారులతో మాట్లాడారని పర్వత సురేష్ వెల్లడించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా బాలికా, మహిళా అభివృద్ధి అధికారిణి ఉమామహేశ్వరి, మండల తాహసిల్దారు ఎస్.పోతురాజు, ఎమ్.ఈ.ఓ. సూరిశెట్టి వెంకటరమణ, కస్తూర్బా గాంధీ విద్యాలయ ప్రిన్సిపాల్ బీరా బాలామణి కుమారి, శంఖవరం మండలం తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు బద్ది రామారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థినిలకు వరుపుల తమ్మారావు ఫౌండేషన్ తరఫున నోటు పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే, పర్వత సురేష్, జిల్లా బాలికా, మహిళా అభివృద్ధి అధికారిణి ఉమామహేశ్వరి, ఎమ్.ఈ.ఓ. సూరిశెట్టి వెంకటరమణలను ఘనంగా సన్మానించారు. పలువురు పాల్గొన్నారు.

# వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్‌పై కూటమి నేతలు ఫైర్

## మంత్రి సుభాష్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పాలి









**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం వెల్లసావరం జగనన్న లేహౌట్లో పేదల ఇసుకపై ఆరోపణలు చేసిన రామచంద్రపురం వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పై నియోజకవర్గం కూటమి నేతలు ఫైర్ అయ్యారు. జగనన్న లేహౌట్లో టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి నాయకులు ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కంచుమర్తి బాబురావు మాట్లాడుతూ పేదల ఇసుక దోపిడీ చేసిన వారిలో వున్నావారంతా గత వైసీపీలో వున్నవాళ్లు అని,అలానే ఇప్పుడు రౌడీ సిటర్స్ అంటున్న వల్లను గతంలో మిరే తయారు చేసారన్నారు.అలానే నియోజకవర్గంలో ఎవరు ఎమ్ చేసిన మంత్రి మీదే బురద జల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మంత్రి సుభాష్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సూర్యప్రకాష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా టేకుముడి సత్యనారాయణ,పెంకే సంబశివరావు,జాస్తీ విజలక్ష్మి మాట్లాడుతూ హౌసింగ్ ఏఈ గతంలో అనేక అక్రమాలు చేసారని ఐరన్ కూడా దోచేసారని అన్నారు.దోపిడీ రాజ్యం దొంగల రాజ్యం అంటున్న వారు గత ప్రభుత్వంలో మీ అనుచరులుగానే రామచంద్రపురం నియోజకవర్గంలో చెలామణి అయ్యారని ఇప్పుడు ఈ ఇసుక దోపిడీలో వాళ్లే వున్నారని, నియోజకవర్గంలో వున్నా ముగ్గురు రాజకీయ మేధావులు మధ్య ఎమ్మెల్యేగా గెలిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుండి నిత్యం నియోజకవర్గం ప్రజలలో ఉంటూ ఆపద అంటే ఆర్థిక సాయం అందించి ఆపద్బంధువుడులా ఆదుకునే వాసంశెట్టి సుభాష్ చేసే పనులు ప్రజలకి మరింత దగ్గర అవుతున్నాడు అనే స్వార్థంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గం ఉమ్మడి కూటమి నాయకులు కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# తీరు మారదు.. రోగం తగ్గదు..!

## మంత్రి ఆదేశించినా మెరుగుపడని ఆహారం నాణ్యత



**నూజివీడు, విశ్వంవాయిస్ న్యూస్ :** నూజివీడు ట్రిపుల్ ఐటి అధికారుల పర్యవేక్షణా లోపం.. మెస్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి కళాశాలలో గురువారమూ విద్యార్థుల అస్వస్థత పరంపర కొనసాగింది. మరో 121 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడం వారిలో 114 మంది ఓపిలో చికిత్స పొందగా మరో ఏడుగురు ఇన్‌పేషెంట్లుగా కళాశాల ఆవరణలోని ఆసుపత్రిలో చేరడమే దీనికి నిదర్శనం. కళాశాల ఆవరణలో నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు చెందిన సుమారు 10,800 మంది విద్యార్థులు ఉండగా ఇప్పటికే తొమ్మిది వందల మందికిపైగా విద్యార్థులు రోగాల బారిన పడి చికిత్స పొందుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, నరాల పోటు, జాయింట్స్ పెయిన్, డయేరియా, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో బాధపడుతున్నారు.మంత్రి ఆదేశించినా నాణ్యమైన భోజనం నిల్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై కళాశాలలోనే బుధవారం అర్ధరాత్రి వరకూ రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సమీక్షించారు. ఆహార నాణ్యతను పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశించారు. అయితే గురువారం ఉదయం మళ్లీ ఉడకని కోడిగుడ్లు, ఉప్మా అల్పాహారంగా పెట్టడంతో విద్యార్థులు తినలేక పారేశారు. మధ్యాహ్నం భోజనంలో అదే పరిస్థితి పునరావృతమైంది. నీళ్ల చారు, నీళ్ల మజ్జిగ, పురుగులతో నిండిన బెండకాయ కూరతో అన్నం తినలేక విద్యార్థులు పస్తులున్నారు. కళాశాలలో పరిస్థితులను ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారుల బృందం పరిశీలించి ఆహార నాణ్యత, కిచెన్‌లో అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేసింది. గురువారం సాయంత్రం ఆర్‌డిఓ భవానిశంకరి కళాశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మెస్‌లో భోజనం చేసి ఆహార పదార్థాల నాణ్యతపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డిఓ విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలపై లిఖితపూర్వకంగా ఇస్తే తాను కలెక్టర్‌కు నివేదిక ఇచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. జడ్జిలు పరిశీలన ట్రిపుల్ ఐటి కళాశాలను గురువారం రాత్రి అదనపు జిల్లా జడ్జి నాగ శైలజ, సివిల్ జడ్జి షేక్ పెద్ద ఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.హరి బాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ వి.కృష్ణమూర్తి, నూజివీడు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇందుపల్లి సత్యప్రకాష్ సందర్శించారు. కళాశాలలోని మెస్‌లను బృందం పరిశీలించింది. తక్షణం మెరుగైన చికిత్స, ఆహారం అందించండికారకులపై చర్యలు తీసుకోండి: సిపిఎం నూజివీడు ట్రిపుల్ ఐటిలో సుమారు తొమ్మిది వందల మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని విద్యార్థులకు మెరుగైన చికిత్సతోపాటు నాణ్యమైన ఆహారం అందించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. యుద్ధప్రాతిపదికన కళాశాలలో, మెస్‌లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పరిస్థితి దారుణంగా ఉన్నా, మంత్రి ఆదేశించినా ఆహారం నాణ్యత మెరుగుపర్చని, మెస్‌లను పరిశుభ్రంగా ఉంచని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని వారు కోరారు.జనసేన బృందం పరిశీలన నూజి వీడు ట్రిపుల్‌ఐటిలో పరిస్థితులను జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బర్మా ఫణిబాబు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోటా వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్, పాశం నాగబాబు, కడియం శ్రీను, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## కొల్లేరులో వసూల్ రాజాలు..!

**ఏలూరు విశ్వంవాయిస్ న్యూస్ :** కొల్లేరులో వసూళ్ల రాజాలు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. కొల్లేరు గ్రామాల పరిధికి చెందిన ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు వసూళ్ల దందాకు తెరలేపినట్లు చెబుతున్నారు. ఐదో కాంటూరు కింద ఉన్న చేపల చెరువుల నుంచి ఎకరాకు రూ.15 వేలు చొప్పున మామూళ్లు చెల్లించాలని చెరువుల యజమానులకు హుకుం జారీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. కొల్లేరు గ్రామాలు ఉన్న నియోజకవర్గాల్లోని నాయకులే ఈ దందాకు పూనుకున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో చెరువులు తవ్వుకున్న చిన్నాచితక రైతుల్లో అయోమయం నెలకొంది. సొమ్ము చెల్లించకపోతే తీవ్ర ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. 2006లో అప్పటి ప్రభుత్వం 'ఆపరేషన్ కొల్లేరు' పేరుతో చేపల చెరువులను ధ్వంసం చేసింది. దీంతో కొల్లేరు గ్రామాల ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. దీంతో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని కొల్లేరు ప్రజలు ఎన్నోఏళ్లుగా ఆందోళనలు, నిరసనలు చేపట్టడంతోపాటు, ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. 2014 ఎన్నికల్లో కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన టిడిపి, బిజెపి కూటమి తెలిపింది. భీమవరంలో జరిగిన ఎన్నికల సభలో అప్పట్లో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ సైతం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక టిడిపి, బిజెపి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో కొల్లేరు ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దిద్దుబాటు చర్యలకు దిగిన అప్పటి టిడిపి కూటమి ప్రభుత్వం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపింది. కేంద్రంలోని మోడీ సర్కార్ పట్టించుకోలేదు. దీంతో అనధికారికంగా ప్రజాప్రతినిధులంతా కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలకు సహకరించారు. కైకలూరు, ఉంగుటూరు, ఉండి, దెందులూరు నియోజకవర్గాల్లో కొల్లేరు ప్రాంతం విస్తరించి ఉంది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం కొల్లేరులో అనధికారికంగా చేపల చెరువుల తవ్వకాలను ప్రోత్సహించారు. ప్రజాప్రతినిధులే చేపల చెరువుల్లో వాటాలు తీసుకుని తవ్వించిన పరిస్థితి ఉంది. దెందులూరు నియోజకవర గ్గంలో కొల్లేరు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య చెరువుల తవ్వకాలు, వాటాల సొమ్ము కోసం ఘర్షణలు సైతం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కొల్లేరులో వైసిపి నాయకుల దందాపై అప్పట్లో తీవ్ర దుమారం రేగిందిఇప్పుడు మరో రకం దందా..! టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూటమి పార్టీల నాయకులు కొల్లేరులో చేపల చెరువుల నుంచి దందాకు తెరలేపినట్లు పెద్దఎ త్తున ప్రచారం సాగుతోంది. కొత్తగా చేపల చెరువుల తవ్వకాలకు ఇబ్బంది ఉండటంతో తవ్వకాలు జరిపిన చెరువుల నుంచి సొమ్ము వసూళ్లకు దిగినట్లు తెలిసిం ది. ఐదోకాంటూరు కింద తవ్వకాలు జరిగిన చేపల చెరువుల యజమానులు ఎకరాకు రూ.20 వేలు చెల్లించాలని హుకుం జారీచేయగా, తర్జభర్జనల అనంతరం ఎకరాకు రూ.15 వేలు చెల్లించాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఐదో కాంటూరు కింద వేలాది ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. దీంతో రూ.కోట్లలో వసూళ్ల దందా సాగనున్నట్లు చర్చ సాగు తోంది. ఆయా నియోజకవర్గ నాయకులకు సొమ్ము చేరేలా ప్రణాళిక రూపొందించినట్లు సమా చారం. జనసేన ప్రజాప్రతినిధి ఉన్న నియోజకవర్గంలో టిడిపి నేత చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సదరు ప్రజాప్రతినిధికి తెలిసే ఈ దందా జరుగుతుందా.. లేదా అనే చర్చ సైతం సాగుతోంది.

# క్యూట్‌గా దివి..?



తెలుగు బిగ్ బాస్ ద్వారా ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ దివి. అంతకు ముందు పలు సినిమాల్లో నటించినా కూడా అవేవి పెద్దగా దివికి గుర్తింపును తెచ్చి పెట్టలేక పోయాయి. కానీ ఎప్పుడైతే బిగ్ బాస్ లో దివి ఎంట్రీ ఇచ్చిందో అప్పటి నుంచి అందరి దృష్టి ఆమె పై పడింది. షో లో కొన్ని రోజుల వరకు సైలెంట్ గా ఉన్న దివి ఒక రోజు అందరి చూపు తన వైపు తిప్పుకుంది. హౌస్ లో ఉన్నది కొన్ని రోజులే అయినా కూడా దివికి మంచి పాపులారిటీ దక్కింది. బిగ్ బాస్ ఫైనల్ ఎపిసోడ్ రోజు చిరంజీవి మాట్లాడుతూ దివిపై ప్రశంసల వర్షం కురిపించడంతో పాటు ఆమె అందం ను పొగడ్తలతో ముంచెత్తాడు. చిరంజీవి స్వయంగా మాట్లాడుతూ దివి కి తన సినిమాలో ఛాన్స్ ఇస్తాను అంటూ హామీ ఇచ్చారు. ఆయన చెప్పినట్లుగానే దివికి సినిమా ఛాన్స్ దక్కింది. అయితే సినిమాల్లో దివికి అదృష్టం కలిసి రాలేదు. బిగ్ బాస్ తర్వాత దివి చాలా సినిమాల్లో నటించింది. కానీ ఏ ఒక్క సినిమా కూడా నటిగా ఆమెను మరో స్థాయికి తీసుకు వెళ్లలేక పోయాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఆమె క్రేజ్ స్టార్ హీరోయిన్స్ రేంజ్ లో దూసుకు పోతూనే ఉంది. దాదాపుగా 1.3 మిలియన్ల ఫాలోవర్స్ ను ఇన్‌స్టాగ్రామ్ లో కలిగి ఉన్న దివి రెగ్యులర్ గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి దివి తన అందమైన క్యూట్ ఫోటోలను షేర్ చేసింది. దివి ఇప్పటి వరకు చాలా సార్లు స్కిన్ షో ఫోటోలు షేర్ చేసింది. నడుము అందాలను చూపిస్తూ చీర కట్టు లో కనిపించింది. ఇంకా పలు రకాల ఔట్ ఫిట్ లో కనిపించి కన్నుల విందు చేసింది. అయితే ఈసారి మేకప్ ఏమీ లేకుండా సింపుల్ అండ్ స్వీట్ లుక్ లో చాలా నేచురల్ గా పెద్దగా ఫిల్టర్స్ ఏమీ లేకుండా నే తీసుకున్న ఈ ఫోటోను దివి షేర్ చేసింది. పెద్దగా మేకప్ లేకున్నా కూడా దివి చాలా అందంగా ఉందని, నేచురల్ బ్యూటీ అంటూ నెటిజన్స్ మరియు ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అమ్మడికి సోషల్ మీడియాలో హీరోయిన్స్ స్థాయి ఇమేజ్ ఉండటంతో పలువురు ఫిల్మ్ మేకర్స్ ఆమెతో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం

## సినీ వాయిస్ CINEMA

# మేజర్ బ్యూటీ స్ట్రైకింగ్



నేటితరంలో సోషల్ మీడియాల్లో స్పీడున్న భామగా సయీ మంజ్రేకర్ సుపరిచితురాలు. తాజాగా సయీ షేర్ చేసిన బీచ్ సెలబ్రేషన్ కి సంబంధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. వీటిలో సయీ వైట్ టాప్ ధరించి కాంబినేషన్ బ్లాక్ షేడ్స్ లో మతులు చెడగొడుతోంది. బాటమ్ ని కవర్ చేస్తూ పింక్ టవల్ ని చుట్టుకుంది ఈ బ్యూటీ. బీచ్ ఇసుకలో షాపింగ్ ఏరియా నుంచి సయీ మంజ్రేకర్ వీక్షణకు సంబంధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. బీచ్ పరిసరాల్లో అందమైన షాపింగ్ ప్లేస్ కి సంబంధించిన ఫోటోలను సయీ షేర్ చేసింది. అలాగే సముద్రంలో జలకాలాటలకు సిద్ధమవుతున్నప్పటి ఓ బికినీ ఫోజ్ కూడా ఈ ఫోటోషూట్ లో కనిపించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. మేజర్ లాంటి పాన్ ఇండియా చిత్రంలో నటించిన సయీ ముఖర్జీ ప్రస్తుతం తెలుగు-హిందీలో అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. మరోవైపు తమిళంలోను ఈ భామకు అవకాశాలొస్తున్నాయి. దబాంగ్ 3తో కెరీర్ ప్రారంభించిన సయీ మంజ్రేకర్ తన తొలి చిత్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ పై ఎప్పటికీ తన ప్రేమను కురిపిస్తూనే ఉంటుంది. ఇక తన తండ్రి మహేష్ మంజ్రేకర్ గురించి మాట్లాడుతూ.. ఆయన తన నిర్ణయాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోరని తెలిపింది. నాన్న ఒక దర్శకుడిగా నాకు ఉత్తమమైన సలహా ఇస్తాడు. కానీ నా సినిమా చూసిన తర్వాత చాలా నిర్మాణాత్మక విమర్శలు కూడా చేస్తారని వెల్లడించింది. తన నటన గురించి రివ్యూలు చేస్తాడని, ఇంకా ఉత్తమంగా ఎలా నటించాలో వివరిస్తారని కూడా తెలిపింది. తదుపరి అజయ్ దేవగన్, టబు లాంటి జాతీయ ఉత్తమ తారలతో కలిసి సయీ మంజ్రేకర్ పని చేస్తోంది. ఔరాన్ మే కహన్ దమ్ థా (అనువాదం.?వేర్ డిడ్ అదర్స్ హావ్ ద కరేజ్) అనేది మూవీ టైటిల్. నీరజ్ పాండే దర్శకత్వం వహించిన రొమాంటిక్ థ్రిల్లర్ లో దేవగన్, టబు కలిసి వారి పదవ చిత్రంలో నటించారు. జిమ్మీ షేర్‌గిల్, శాంతను మహేశ్వరి- సాయి మంజ్రేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఔరాన్ మే కహన్ దమ్ థా 5 జూలై 2024న విడుదల కావాల్సి ఉంది. అయితే ఫిల్మ్ ఎగ్జిబిటర్లు మరియు ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్‌ల అభ్యర్థన మేరకు విడుదల 2 ఆగస్ట్ 2024కి వాయిదా పడింది.

# దెయ్యాల చుట్టూ రష్మిక..



సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తెలుగు, హిందీ భాషలలో వరుస సినిమాలతో దూసుకుపోతోంది. నెక్స్ట్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో నటించిన పుష్ప ది రూల్ మూవీ డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. అదే రోజు హిందీలో ఛత్రపతి శివాజీ కథతో తెరకెక్కిన చావా మూవీ ప్రేక్షకుల ముందుకి వస్తోంది. హిందీలో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. యానిమల్ మూవీతో వచ్చిన క్రేజ్ రష్మిక మందనని పాన్ ఇండియా స్టార్ గా మార్చేసింది. అందుకే ఓ వైపు స్టార్ హీరోల సినిమాలలో అవకాశాలు అందుకుంటూనే మరో వైపు ఫిమేల్ సెంట్రిక్ సినిమా ఛాన్స్ లు కూడా రష్మిక సొంతం చేసుకుంటుంది. పుష్ప 2, చావా సినిమాలు రిలీజ్ కి రెడీ అవుతూ ఉండగా రష్మిక మందన లీడ్ రోల్ లో మరో మూడు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. అందులో ధనుష్, శేఖర్ కమ్ముల కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న కుభేర ఒకటి. ఈ చిత్రం పాన్ ఇండియా ప్రాజెక్ట్ గానే రెడీ అవుతోంది. అలాగే రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ది గర్ల్ ఫ్రెండ్ అనే ఫిమేల్ సెంట్రిక్ మూవీ ఒకటి సిద్ధం అవుతోంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఇదిలా ఉంటే హిందీలో ఇప్పుడు ఓ హర్రర్ జోనర్ సినిమాలో రష్మిక నటించబోతోందంట. ఈ మూవీ షూటింగ్ త్వరలో ప్రారంభం కాబోతోంది. ఈ మధ్యకాలంలో బాలీవుడ్ లో హర్రర్ జోనర్ సినిమాలకి మంచి ఆదరణ వస్తోన్న నేపథ్యంలో రష్మిక మందన నటించబోయే సినిమా పైన కూడా హైప్ క్రియేట్ అయ్యింది. వాంపైర్స్ ఆఫ్ విజయనగర టైటిల్ తో ఈ హర్రర్ మూవీ తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది.

## క్రీడా వాయిస్

# రూట్ సెంచరీ

ఇంగ్లండ్ 220/6, శ్రీలంకతో రెండోటెస్ట్



ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ సెంచరీతో కదం తొక్కాడు. శ్రీలంకతో లార్డ్ వేదికగా గురువారం నుంచి ప్రారంభమైన రెండోటెస్ట్‌లో రూట్ సెంచరీతో చెలరేగాడు. తొలుత శ్రీలంక పేసర్ల ధాటికి తొలి సెషన్‌లోనే మూడు వికెట్లు పడిన జట్టుకు రూట్ ఆదుకున్నాడు. తొలి టెస్ట్ హీరో హ్యారీ బ్రూక్(33)తో కలిసి 4వ వికెట్‌కు 48పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ జోడీని అసితా ఫెర్నాండో విడదీశాడు. తొలి టెస్టు శతక వీరుడు జేమీ స్మిత్(21) అండగా భారీ భాగస్వామ్యం నెలకొల్పే పనిలో ఉన్న రూట్‌కు లంక బౌలర్లు బ్రేక్ వేశారు. మిలన్ రత్ననాయకే .. స్మిత్‌ను ఔట్ చేయడంలో ఇంగ్లండ్ స్కోర్ వేగం తగ్గింది. తొలుత డేంజరస్ డానియెల్ లారెన్స్(9)ను ఔట్ చేసి లంకకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత మరో 9 పరుగుల వ్యవధిలోనే ఇంగ్లండ్ సారథి ఓలీ పోప్(1)ను అసిథ ఫెర్నాండో బోల్తా కొట్టించాడు. తొలి సెషన్‌లో 42కే రెండు వికెట్లు పడిన దశలో ఓపెనర్ బెన్ డకెట్(40)తో కలిసి జో రూట్ ఇన్నింగ్స్ నిర్మించాడు. టీ విరామం తర్వాత రూట్ లాహిరు కుమార వేసిన 63వ ఓవర్ 3వ బంతిని ఫోర్ బాది సెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు 63ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 226పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లు ఫెర్నాండో, కుమారకు రెండేసి, రత్నాయకే, జయసూరియకు ఒక్కో వికెట్ దక్కాయి.

# శివాజీ పార్క్‌లో సచిన్ చిన్ననాటి కోచ్ విగ్రహం



ముంబయిలోని ప్రసిద్ధ శివాజీ పార్క్‌లో సచిన్ తెందూల్కర్ చిన్ననాటి కోచ్ రమాకాంత్ అచ్రేకర్ స్మారక చిహ్నం ఏర్పాటు ప్రతిపాదనకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శివాజీ పార్క్‌లో 5వ నంబర్ గేటు సమీపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనుంది. మహారాష్ట్ర సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సచిన్ సంతోషం వ్యక్తం చేశాడు. "అచ్రేకర్ సర్ నాతోపాటు ఎంతోమంది క్రికెటర్ల జీవితాలపై అపారమైన ప్రభావాన్ని చూపారు. అచ్రేకర్ జీవితం శివాజీ పార్క్‌లో క్రికెట్ చుట్టూ తిరిగింది. ఎప్పుడూ ఆ పార్క్‌లోనే ఉండాలనేది ఆయన కోరిక. అచ్రేకర్ సార్ విగ్రహాన్ని ఆయన పని ప్రదేశంలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరం" అని సచిన్ ఎక్స్ (ట్విటర్)లో రాసుకొచ్చాడు. కాగా విగ్రహం నిర్వహణ బాధ్యతను వి కామత్ మెమోరియల్ క్రికెట్ క్లబ్‌కు అప్పగించారు. అయితే, ఇందుకు ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సాయం అందించదు.


# బ్యాడ్మింటన్‌లో మనీషా, తులసి గెలుపు



17వ పారా ఒలింపిక్స్‌లో భారత పారా షట్లర్లు రాణించారు. మహిళల సింగిల్స్(ఎన్‌యు-5)లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన మురుగేశన్ తులసిమతి గ్రూప్ స్టేజ్ తొలి మ్యాచ్‌లో సునాయాసంగా గెలిచింది. గురువారం జరిగిన గ్రూప్-ఎలో తులసిమతి 21-9, 21-11తో ఇటలీకి చెందిన మార్కో రోసాపై సునాయాసంగా నెగ్గింది. గ్రూప్-సిలో 2వ ర్యాంకర్ మనీషా 8-21, 21-6, 21-19 తో స్థానిక క్రీడాకారిణి లీఫోర్ట్‌ను చిత్తుచేసింది. ఈ మ్యాచ్ సుమారు 50నిమిషాలసేపు సాగింది. ఇక పురుషుల సింగిల్స్ గ్రూప్-డి (ఎస్‌ఎల్-4)లో తరుణ్ 21-17, 21-19తో బ్రెజిల్‌కు చెందిన ఓలివేరియాను చిత్తుచేశాడు. మరో పోటీలో మన్‌దీప్ కౌర్ తొలి రౌండ్‌లోనే ఓటమిపాలయ్యాడు. పతకం ఖాయం చేసే షట్లర్లలో ఒకడైన 2వ సీడ్ మన్‌దీప్ నైజీరియా ప్లేయర్ మరియమ్ ఎనియోల బొలాజీ చేతిలో 8-21, 14-21తో మన్‌దీప్ పోరాడి ఓడాడు.

# 3వేల స్టీపుల్‌ఛేజ్‌లో షారుక్ జాతీయ రికార్డు

## అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 3వేల మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో షారుక్ ఖాన్ జాతీయ రికార్డును బ్రేక్ చేశాడు. బుధవారం రాత్రి జరిగిన స్టీపుల్‌ఛేజ్‌లో భారత్‌కు చెందిన 18ఏళ్ల షారుక్ 8నిమిషాల 45:12సెకన్లలో గమ్యానికి చేరి 6వ స్థానంలో నిలిచాడు. దీంతో 31న జరిగే ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఈ హీట్‌లో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్‌కు చేరతారు. అంతకుముందు ఈ రికార్డు 19ఏళ్ల రాజస్తాన్‌కు చెందిన రాజేశ్ పేర ఉండేది. అతడు భువనేశ్వర్ వేదికగా మేలో జరిగిన ఫెడరేషన్ కప్ జాతీయ సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో 8నిమిషాల 50:12సెకన్లలో గమ్యానికి చేరి జాతీయ రికార్డును నెలకొల్పాడు. షారుక్ ఖాన్ పర్సనల్ బెస్ట్ 8నిమిషాల 51:75 సెకన్ల రికార్డును తాజాగా సవరించుకొన్నాడు. ఇక పురుషుల 400మీ. పరుగులో జయకుమార్ మూడోస్థానంలో నిలిచి సెమీస్‌కు చేరాడు. అతడు హీట్‌లో 400మీ. పరుగును 46.96సెకన్లలో గమ్యానికి చేరాడు.

# మూడోరౌండ్‌కు జకోవిచ్, టఫీ



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి మాజీ నంబర్‌వన్ ఆటగాడు, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో జకోవిచ్ 6-4, 6-4, 2-0తో ఆధిక్యతలో ఉండగా లస్లో దేరే(సెర్బియా) గాయంతో వైదొలిగాడు. మరో పోటీలో 14వ సీడ్ టఫీ(అమెరికా) 6-4, 6-1, 1-0తో ఆధిక్యతలో కజకిస్తాన్‌కు చెందిన అలెగ్జాండర్ కూడా గాయం కారణంగా మ్యాచ్‌ను వైదొలిగాడు. మరో పోటీలో 12వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా) 6-3, 7-6(7-1), 6-1తో ఇటలీకి చెందిన బెర్రెట్టినిని చిత్తుచేసి మూడోరౌండ్‌కు చేరాడు.

కసట్కినా ఔట్..

మహిళల సింగిల్స్‌లో 12వ సీడ్, రష్యాకు చెందిన కసట్కినా అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో కసట్కినా 1-6, 6-7(3-7)తో ఓటమిపాలైంది. ఇతర పోటీల్లో 12వ సీడ్ స్విటోలినా(ఉక్రెయిన్) 6-1, 6-2తో తన దేశానికే చెందిన కలినినాను ఓడించగా.. 3వ సీడ్ అమెరికా సంచలనం కోకా గాఫ్ 6-4, 6-0తో మారియా(జర్మనీ)పై సునాయాకంగా నెగ్గి మూడోరౌండ్‌కు చేరింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com